ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



జగిత్యాల

జిల్లా వార్తలు

3★★

బుధవారం 2 జూలై 2025

జూనియర్ కళాశాలలకు మహర్దశ



- పదేళ్ల తర్వాత నిధులు మంజూరు
- జిల్లాలో 11 ప్రభుత్వ కళాశాలలకు రూ.1.08 కోట్లు కేటాయింపు
- భవనాల మరమ్మతు, వసతుల కల్పనకు వినియోగం

కళాశాల - కేటాయించిన నిధులు (రూపాయల్లో)	
సారంగాపూర్	5.70 లక్షలు
మెట్‌పల్లి	12.50 లక్షలు
ఇబ్రహీంపట్నం	5.10 లక్షలు
ధర్మపురి	8.10 లక్షలు
బీర్‌పూర్	6.93 లక్షలు
మల్లాపూర్	3.80 లక్షలు
రాయికల్	16.95 లక్షలు
మల్యాల	16.00 లక్షలు
కోరుట్ల (బాలురు)	7.15 లక్షలు
కోరుట్ల (బాలికలు)	12 లక్షలు
కొడిమ్యాల	14.10 లక్షలు
మొత్తం	రూ.1.08 కోట్లు

జగిత్యాల, జూలై 1 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలకు మహర్దశ పట్టింది. విద్యార్థులకు అన్ని సౌకర్యాలతో కూడిన మెరుగైన విద్య అందించేందుకు గాను ప్రభుత్వం నిధులు కేటాయించింది. జిల్లాలో 11 జూనియర్ కళాశాలలకు రూ.1.08 కోట్లు మంజూరయ్యాయి. దశాబ్దకాలం తర్వాత జూనియర్ కళాశాలలకు నిధులు మంజూరు కావడంతో సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. మంజూరైన నిధులతో పంచాయతీ రాజ్ శాఖ ఆధ్వర్యంలో పనులు చేయించనున్నారు. నెల రోజుల్లోపు పనులు పూర్తి చేసే దిశగా అధికారులు కసరత్తులు చేస్తున్నారు.

● మెరుగుకానున్న మౌలిక వసతులు

పదేళ్లగా ప్రభుత్వ జూనియర్ కళాశాలలకు నిధులు రాకపోవడంతో నిర్వహణ ప్రశ్నార్థకంగా మారింది. సరైన వసతులు లేక విద్యార్థులు, అధ్యాపకులు నానా అవస్థలు పడ్డారు. దాదాపు దశాబ్దం తర్వాత ఇంటర్ విద్యాశాఖ నిధులు మంజూరు చేసింది. మూడు నెలల కిందట ప్రతిపాదనలు పంపించగా ఆమోదం లభించింది. పది సంవత్సరాల క్రితం వరకు ఎస్‌ఆర్‌డీపీ కింద యేటా నిధులు మంజూరు జరిగేది. ఆ తరువాత నిధులు విడుదల కాలేదు. పలు చోట్ల ప్రిన్సిపాల్స్ అధ్యాపకులు సొంతంగా కొన్ని రకాల పనులకు సొమ్ము వెచ్చించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఎట్టకేలకు ప్రభుత్వం నిధులు కేటాయించడంతో మౌలిక వసతులు మెరుగుపడనున్నాయి. తరగతి గదుల మరమ్మతుకు అవకాశం లభించింది. ఆయా కళాశాలల్లో మౌలిక వసతులు, భవనాల మరమ్మతులతో పాటు విద్యార్థులకు టాయిలెట్లు, తాగునీరు, విద్యుత్ సౌకర్యం, భవనాలకు రంగులు వేయడం, సీసీ కెమెరాలు ఏర్పాటు, నీటి సరఫరా, ప్లంబింగ్ వంటి పనులు చేపట్టనున్నారు.

● ప్రవేశాలు పెరిగే అవకాశం..

కళాశాలలకు మంజూరు అయిన నిధులతో మరమ్మతులు చేపట్టనున్నారు. విద్యుత్, నీటి సరఫరా, పారిశుధ్యం, ఫర్నీచర్, బోరు బావి ఇతరత్రా సదుపాయాలు కల్పించనున్నారు. మూడు సంవత్సరాల క్రితం కళాశాలల్లో మరుగుదొడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు కాగా బిల్లులు విడుదల కాకపోవడంతో పలుచోట్ల అసంపూర్తిగా మారాయి. వీటిని పూర్తి చేయాల్సి ఉంది. పలు కళాశాలల్లో సీసీ కెమెరాల బిగింపు కొనసాగుతోంది. వేసవి సెలవుల్లో ....

మిగతా 6లో

ఘనంగా జగన్నాథ రథయాత్ర



రథయాత్రలో భక్తులతో కలిసి పాల్గొన్న ఎమ్మెల్యే సంజయ్ కుమార్

జగిత్యాల క్రైం, జూలై 1 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలో ఇస్కాన్ ప్రచార కేంద్రం ఆధ్వర్యంలో మంగళవారం శ్రీ జగన్నాథ స్వామి రథయాత్రను ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే సంజయ్ కుమార్, జడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంతలు పాల్గొని రథయాత్రను ప్రారంభించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని రథాన్ని లాగి తమ భక్తి భావాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆధ్యాత్మిక కార్యక్రమాలతో శాంతి నెలకొంటుందన్నారు. అనంతరం పొన్నాల గార్డెన్‌లో సంకీర్తనం, మహా హారతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయకులు గోలి శ్రీనివాస్, అడువాల లక్ష్మణ్, సుదాకర్, జగన్, శివకేసరి బాబు, అనీల్, ధర్మరాజు, గిరి, చిన్న గంగాధర్, మహేష్, రవి శంకర్, నిర్వాహకులు గుండేటి రవి, జీవన్ దాస్, గోవింద్ దాస్ ఉన్నారు.

●సారంగాపూర్: మండలంలోని రేచపల్లి కొండపై వెలిసిన జగన్నాథ స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం రథోత్సవం నిర్వహించారు. ఆలయ అర్చకులు శ్రీనివాసచార్యులు, రామాచార్యుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ఉత్సవ మూర్తులను రథంపై ప్రతిష్ఠింపజేసి వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయకులు మనోహర్‌రెడ్డి, ఎడ్మల జయ లక్ష్మారెడ్డి, సంజీవరెడ్డి, తిరుపతి, రాజేశం, జగదీష్, మహేష్, హరీష్ తదితరులు, భక్తులు పాల్గొన్నారు.

'బీసీ రిజర్వేషన్లు ప్రకటించాకే ఎన్నికలు నిర్వహించాలి'

జగిత్యాల అర్బన్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): బీసీ రిజర్వేషన్లు 42 శాతం ప్రకటించాకే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి మునిపట్ల లక్ష్మీనారాయణ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. మంగళవారం జిల్లా కేంద్రంలో జరిగిన బీసీ సంక్షేమ సంఘం సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పిస్తామని చెప్పి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందన్నారు. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చాక దానిని పాటించకపోవడం మరోమారు బీసీలను మోసగించే ప్రయత్నమేనని ఆయన విమర్శించారు. సమావేశంలో బీసీ సంక్షేమ సంఘం నాయకులు కొక్కు గంగాధర్, తిరుపురం రాంచంద్రం, రాచకొండ రోజా, బొమ్మిడి సురేష్, అనుమల్ల సంజయ్ సామ్రాట్, ఎలుక భగవాన్ పాల్గొన్నారు.

జిల్లాలో నెలాఖరు వరకు పోలీస్ యాక్ట్

జగిత్యాల క్రైం, జూలై1 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఈనెల 31 వరకు పోలీసు యాక్ట్ అమలులో ఉంటుందని ఎస్పీ అశోక్‌కుమార్ సోమవారం పేర్కొన్నారు. జిల్లా పరిధిలో ఎలాంటి ధర్నాలు, ర్యాలీలు, రాస్తారోకోలు, సభలు, సమావేశాలు నిర్వహిచకూడదన్నారు. వివిధ కార్యక్రమాల నిర్వహణకు ముందుగా పోలీసు అనుమతి తీసుకోవా లన్నారు. శాంతి భద్రతల పరిరక్షణకు నిరంతరం శ్రమిస్తున్న పోలీసులకు అన్ని వర్గాల ప్రజలు సహకారం అందించాలని సూచించారు.

బోనాల కవితల పోటీలు

జగిత్యాల క్రైం, జూలై1 (ఆంధ్రజ్యోతి): బోనాల ఉత్సవాలను పురస్కరించుకుని కళాశ్రీ ఈశ్వరమ్మ సాహిత్య పీఠం ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి బోనాల కవితల పోటీలను నిర్వహిస్తున్నట్లు కళాశ్రీ అధినేత గుండేటి రాజు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బోనాల విశిష్టతను తెలుపుతూ 25నుంచి 30 పంక్తుల కవితను 89853 48424, 9789728413 నంబర్లకు జూలై 5లోగా వాట్సాప్ చేయాలని నిర్వాహకులు అయిత అనిత, లక్కరాజు శ్రీలక్ష్మి, కటుకం కవితలు కోరారు.

రాజ్యాంగ పరిరక్షణ పాదయాత్ర

మల్లాపూర్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిట్టాపూర్, ముత్యంపేట గ్రామాల్లో కాంగ్రెస్ నాయకులు రాజ్యాంగ పరిరక్షణ పాదయాత్రను మంగళవారం జరిపారు. ఈసందర్భంగా కాంగ్రెస్ నాయకుడు కృష్ణారావు ప్రార్టీ శ్రేణులతో కలిసి అంబేద్కర్ చిత్ర పటంతో పాదయాత్ర చేపట్టారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, రవి, నరేష్ రెడ్డి, అల్లూరి శ్రీనివాస్‌రెడ్డి, బాపు రెడ్డి, రఘువర్ధన్, పవన్ పాల్గొన్నారు.

'ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలి'

మెట్‌పల్లి రూరల్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు వేగవంతం అయ్యేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సత్య ప్రసాద్ సూచించారు. మంగళవారం మండలంలోని జగ్గసాగర్ గ్రామంలోని ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను డీఆర్డీవో, పీడీ రఘువరన్, ఆర్డీవో శ్రీనివాస్‌లతో కలిసి పరిశీలించారు. గ్రామంలో ఎన్ని ఇండ్లు మంజూరు అయ్యాయని ఎంపీడీవో మహేశ్వర్‌రెడ్డిని అడిగి తెలుసుకున్నారు. ఇల్లు మంజూరైన వారందరు నిర్మాణాలు చేపట్టడానికి గ్రామంలోని లబ్ధిదారులను ప్రోత్సహించాలని పంచాయతీ కార్యదర్శి ప్రశాంత్‌కు పలు సూచనలు చేశారు. ఇప్పటికే నిర్మాణాలు చేపట్టిన వారు నిబంధలనకు అనుగుణంగా పనులు పూర్తి చేసుకునేలా అధికారులు అవగాహన కల్పించాలని ఆదేశించారు. ఇందిరమ్మ ఇళ్లకు ఇసుక, మట్టి ఇబ్బందులు ఉన్నాయని లబ్ధిదారులు కలెక్టర్ తెలపగా వెంటనే సమస్యను పరిష్కరించాలని తహసీల్దార్ శ్రీనివాస్‌కు సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలోని లబ్ధిదారులు తర్వగా ఇండ్ల నిర్మాణ పనులు ప్రారంభించని గుర్తించి ప్రారంభించేల చూడాలని, నిర్మాణాలు చేపట్టిన వారు నిర్దేశిత గడుపులోపు, నిబంధనలకు అనుగుణంగా నాణ్యతతో పూర్తి చేసుకునేలా అధికారులు తగు ప్రోత్సహం అందించాలన్నారు. ఇళ్ల నిర్మాణాలు నిబంధనలకు అనుగుణంగా నాణ్యతా ప్రమాణాలతో చేపట్టాలని అధికారులు సూచనలు చేయాలన్నారు. నిర్మాణాలు జరిగిన విధంగా దశల వారీగా డబ్బులు లబ్ధిదారుల ఖాతాలో జమ చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీవో మహేశ్వర్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి ప్రశాంత్, కాంగ్రెస్ కిసాన్‌సెల్ మండలాధ్యక్షుడు పిడుగు తిరుపతిరెడ్డి, ఇందిరమ్మ ఇళ్ల కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను పరిశీలిస్తున్న కలెక్టర్ సత్యప్రసాద్

వన మహోత్సవంలో అందరినీ భాగస్వాములను చేయాలి

● డీఆర్డీవో పీడీ రఘువరన్

6

'స్వచ్ఛ సర్వేక్షణ్ సర్వేలో అందరూ పాల్గొనాలి'



మాట్లాడుతున్న జిల్లా కోఆర్డినేటర్ హరిణి

జగిత్యాలరూరల్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): స్వచ్ఛ సర్వేక్షణ్ సర్వేలో ప్రతి ఒక్కరు పాల్గొనాలని ఎస్‌బీఎమ్ జిల్లా కో ఆర్డినేటర్ హరిణి, జగిత్యాల మండల ఐకేపీ ఏపీఎం ఓదెల గంగాధర్‌లు కోరారు. జగిత్యాల మండల ఐకేపీ కార్యాలయంలో మంగళవారం గ్రామ సమైక్య అధ్యక్షులకు, సిబ్బందికి స్వచ్ఛ సర్వేక్షణ్-2025 గ్రామీణ ఓటింగ్‌పై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా వారు మాట్లా డుతూ పరిశుభ్రత ర్యాంకింగ్‌లో ప్రతి సంవత్సరం కేంద్ర ప్రభుత్వం గ్రామాల్లోని పరిశుభ్రత గూర్చి సిటిజన్ ఫీడ్‌బ్యాక్ అనే లింక్ ద్వారా వివరాలను తీసుకుంటుందన్నారు. ఇందులో భాగంగా జగిత్యాల జిల్లాలో ఎస్ఎస్‌జీ-2025 ఫీడ్ బ్యాక్ ఓటింగ్‌లో జిల్లా ప్రజలు స్వచ్ఛందంగా పాల్గొని జిల్లాను ప్రథమ స్థానంలో నిలపాలని కోరారు.

యాప్‌లో అడిగే 13 రకాల ప్రశ్నలకు సరైన విధంగా సమాధానాలు తెలపాలని వారు సూచించారు. ఈకార్యక్రమంలో సీసీ లు విద్యాసాగర్, రవీందర్, గంగారాం, మరియా, శ్రీనివాస్, అర్బన్, రూరల్‌మండలాల సమాఖ్య అధ్యక్షురాళ్లు, గంగాభవాని, సత్తవ్వ, తదితరులు పాల్గొన్నారు.

'శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు'



మాట్లాడుతున్న ఎస్పీ అశోక్ కుమార్

జగిత్యాల క్రైం, జూలై1 (ఆంధ్రజ్యోతి): శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే రౌడీషీట్స్ ఓపెన్ చేయాలని పోలీస్ అధికారులకు ఎస్పీ అశోక్ కుమార్ సూచించారు. జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో మంగళవారం ఎస్పీ నెలవారీ నేర సమీక్ష సమావేశాన్ని నిర్వహించి మాట్లాడారు. సమస్యలను క్షేత్ర స్థాయిలో గుర్తించి ప్రజలకు సేవలు అందించే విధంగా సిబ్బంది కృషి చేయాలన్నారు. పెండింగ్ కేసులను త్వరితగతిన పరిష్కరించాలన్నారు. నాన్ బెయిలబుల్ వారెంట్లపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. సీసీకెమెరాల పని తీరుపై ప్రతి రోజు శ్రద్ధ వహించాలన్నారు. రాష్ట్ర, వివిధ జిల్లాల సరిహద్దుల్లో గంజాయి సరఫరా చేసే కీలక వ్యక్తులను గుర్తించి వారిపై కేసులు నమోదు చేయాలన్నారు. దొంగతనాల నివారణకు ప్రతి సర్కిల్‌లో ఒక స్పెషల్ టీమ్‌ను నియమించాలన్నారు. డ్రంకెన్‌డ్రైవ్ పరీక్షలతో పాటు వాహనాల తనిఖీలు చేపట్టాలన్నారు. వినాయక చవితిని దృష్టిలో పెట్టుకుని విగ్రహాల తయారీ కేంద్రాల వద్ద అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూడాలన్నారు. రౌడీషీటర్స్‌పై నిఘా పెట్టాలన్నారు. అనంతరం విధి నిర్వహణలో ప్రతిభ కనబరిచిన అధికారులకు, సిబ్బందికి ప్రోత్సాహకాలను ఎస్పీ చేతుల మీదుగా అందజేశారు.

సమీక్షలో డీఎస్పీలు వెంకట రమణ, రఘుచందర్, రాములు, డీసీ ఆర్‌బీ, ఎస్‌బీ, ఐటీ కోర్, సీసీఎస్ ఇన్‌స్పెక్టర్లు శ్రీనివాస్, ఆరీఫ్ అలీఖాన్, రఫీక్‌ఖాన్, శ్రీనివాస్, ఆర్ఐలు కిరణ్ కుమార్, వేణు, సీఐలు కరుణాకర్, సుధాకర్, రాంనర్సింహారెడ్డి, రవి, సురేష్ ఉన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

జగిత్యాల అగ్రికల్చర్, జూలై1 (ఆంధ్రజ్యోతి): కార్మికుల సమస్యల పరిష్కా రానికి తన వంతు కృషి చేస్తానని జిల్లా విద్యుత్ శాఖ ఎస్ఈ సుదర్శనం అన్నారు. నూతన ఎస్ఈగా పదవీ బాధ్యతలు చేపట్టిన సుదర్శనంను టీఆర్ వీకేఎస్ విద్యుత్ కార్మిక సంఘ నాయకులు మర్యాద పూర్వకంగా కలిశారు. అనంతరం తమ సమస్యలను ఎస్ఈ దృష్టికి తీసుకెళ్లగా ఆయన సానుకూలంగా స్పందించినట్లు యూనియన్ నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘ జిల్లా అధ్యక్షుడు వేణు, కార్యదర్శి రాజవీరు, జిల్లాలోని మెట్‌పెల్లి, జగిత్యాల డివిజన్ల అధ్యక్ష, కార్యదర్శులు సతీష్, మధు, దేవరాజు, శ్రీధర్, సిటీ సర్కిల్ అధ్యక్షుడు సతీష్‌చ కార్యదర్శి చంద్రశేఖర్‌తో పాటు సంఘ బాధ్యులు పాల్గొన్నారు.

యూరియా విక్రయాల్లో పారదర్శకత పాటించాలి

కథలాపూర్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): యూరియా విక్రయాల్లో పారదర్శకత పాటించాలని జిల్లా వ్యవసాయాధికారి భాస్కర్ అన్నారు. దుకాణాల్లో యూరియా బ్లాక్ చేసి విక్రయిస్తే కఠిన చర్యల తప్పవని ఆయన హెచ్చరించారు. మంగళవారం రైతు వేదికలో వీడియో కాన్ఫరెన్స్‌ను వీక్షించిన అనంతరం పోతారం, పోసానిపేట, గంభీర్‌పూర్ గ్రామాల్లోని ఫర్టిలైజర్ దుకాణాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. యూరియాను రైతులకు ఎప్పటికప్పుడు సరఫరా చేయాలని పేర్కొన్నారు. సింగిల్‌విండో పోసానిపేట, దూలూరు, గంభీర్‌పూర్ గోదాముల్లో నిల్వ ఉన్న యూరియా నిల్వలను పరిశీలించారు. డీలర్లు ఎమ్మార్పీకే యూరియా, కాంప్లెక్స్ ఎరువులు విక్రయించాలని సూచించారు. కార్యక్రమంలో ఏవో యోగిత, ఏఈఓలు శేఖర్, సంధ్య, హరీశ్, విండో సీఈవో విజయ్ తదితరులు ఉన్నారు.



రికార్డులు పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి భాస్కర్

అప్పుల బాధతో ఒకరి ఆత్మహత్య

మల్యాల, జూలై 1(ఆంధ్రజ్యోతి): మల్యాల మండలం మద్దుట్లకు చెందిన సల్లూరి తిరుపతి(51) అప్పుల బాధతో మంగళవారం ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్సై నరేశ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. తిరుపతి ఎడమ కాలుకు కొన్నేళ్ల క్రితం గాయం కాగా దాని చికిత్స కోసం, కుటుంబ అవసరాల కోసం అప్పులు చేశాడు. తిరుపతి అప్పులు తీర్చలేక మంగళవారం గ్రామ శివారులో ఉరి వేసుకున్నాడు. మృతుడికి భార్య, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. మృతుడి భార్య దేవేంద్ర ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదానికి కారణమైన డ్రైవర్‌పై కేసు

ఎల్లారెడ్డిపేట, జూలై 1 (ఆంధ్రజ్యోతి) : ఎల్లారెడ్డిపేట మండలం వెంకటాపూర్ గ్రామ శివారులోని కామారెడ్డి-సిరిసిల్ల ప్రధాన రహదారిపై అతివేగంతో వాహనం నడిపి ప్రమాదానికి కారణమైన సంఘటనలో వరంగల్ జిల్లాకు చెందిన వాహన డ్రైవర్ వెంకటేశ్‌పై కేసు నమోదు చేశామని ఎస్ఐ రాహుల్‌రెడ్డి మంగళవారం తెలిపారు. వెంకటేశ్ తన బొలెరో వాహనంతో రగుడు బైపాస్ రోడ్డు నుంచి వెంకటాపూర్ మీదుగా కామారెడ్డి వైపు వెళుతున్నాడని పేర్కొన్నారు. వెంకటాపూర్ మూల మలుపు వద్ద వాహనం అదుపు తప్పి ఎదురుగా ఉన్న చెట్టుకు ఢీకొట్టినట్లు తెలిపారు. వెంకటేశ్ తన వాహనంతో తమ ఇంటి ముందు ఉన్న చెట్టును ఢీకొనడంతో తాము భయాందోళనకు గురయ్యామని బాధితురాలు వాగుమడి వెంకటలక్ష్మీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని ఎస్ఐ రాహుల్‌రెడ్డి వివరించారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని బాలుడి మృతి

పెద్దపల్లిటౌన్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): పెద్దపల్లి బస్టాండ్ వద్ద సోమవారం ఆర్టీసీ బస్సు ఢీకొన్న ఘటనలో చికిత్స పొందుతూ బాలుడు మృతి చెందాడు. జూలపల్లి మండలం కుమ్మరికుంటకు చెందిన అవునూరి నితిన్ (17) చిన్నబొంకూర్‌కు చెందిన అన్వేష్ (19) రైల్వేస్టేషన్‌వైపు వెళ్లి వస్తుండగా బస్టాండ్ ఎంట్రెన్స్ వద్ద ఆర్టీసీ బస్సు ఇద్దరిని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో నితిన్ తలకు తీవ్రగాయాలు కాగా అన్వేష్ స్వల్పంగా గాయపడ్డాడు. స్థానికులు వెంటనే 108కు ఫోన్ చేసి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. సమాచారం అందుకున్న కుటుంబీకులు ఆస్పత్రి చేరుకొని మెరుగైన చికిత్స కోసం కరీంనగర్ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ నితిన్ మంగళవారం తెల్లవారు జామున మృతి చెందారు. తండ్రి భూమయ్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

రైల్వే ట్రాక్ వద్ద గేజ్‌ను ఢీకొన్న లారీ


రైల్వే గేటు వద్ద విరిగిపడిన గేజ్

కరీంనగర్ రూరల్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ శివారు తీగలగుట్టపల్లి రైల్వే గేటు వద్ద ఏర్పాటు చేసిన గేజ్‌ను సోమవారం లారీ ఢీకొనడంతో విరిగిపడింది. చొప్పదండి వెళ్లే ప్రధాన రహదారిపై ఉన్న రైల్వే గేటును ఓవర్ బ్రిడ్జి నిర్మాణ పనుల్లో భాగంగా పక్కన ఏర్పాటు చేశారు. భారీ వాహనాలు రాకుండా గేజ్ నిర్మాణం చేపట్టారు. లోడ్‌తో వెళ్తున్న లారీ గేజ్‌ను తాకడంతో విరిగి పడింది. ఎలాంటి ప్రమాదం జరుగకపోవడంతో జనం ఊపిరి పీల్చుకున్నారు.

ట్రాక్టర్ ఢీకొని ఒకరికి గాయాలు

వీణవంక, జూలై1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పోతిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన నందిపేట కొంరయ్యను ట్రాక్టర్ ఢీకొనడంతో గాయపడ్డాడు. మంగళవారం పొలం పనులు ముగించుకొని సైకిల్‌పై ఇంటికి వస్తున్న సమయంలో అదే గ్రామానికి చెందిన రాధారపు అనిల్ ట్రాక్టర్‌తో ఢీకొట్టగా తీవ్రంగా గాయపడ్డాడు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని 108 వాహనంలో కొంరయ్యను జమ్మికుంట ఆసుపత్రికి తరలించారు. ట్రాక్టర్ డ్రైవర్ అనిల్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నాట్టు ఎస్ఐ ఆవుల తిరుపతి తెలిపారు.

పోతిరెడ్డిపల్లిలో లారీ డ్రైవర్ల ధర్నా


పోతిరెడ్డిపల్లి ఇసుక క్వారీలో ధర్నా చేస్తున్న లారీ డ్రైవర్లు

వీణవంక,జూలై01(ఆంధ్రజ్యోతి): మండలంలోని పోతిరెడ్డిపల్లి మానేరు వాగులోని ఇసుక క్వారీలో లారీ డ్రైవర్లు ధర్నా చేపట్టారు. నాలుగు రోజులుగా తాము క్వారీల వద్దే ఉంటున్నామని క్వారీ యాజమాన్యం ఇసుక లోడ్ చేయకుండా ఇబ్బందులు పెడుతున్నారని ఆరోపించారు. ఆన్‌లైన్‌లో బుకింగ్‌లు రావడంతో తాము క్వారీల వద్దకు వస్తే లారీలలో ఇసుక లోడ్ చేయకుండా రోజుల తరబడి వేచి ఉండాల్సి వస్తుందని అన్నారు. ప్రతి లారీకి వెయ్యి నుంచి రెండు వేలు ఇస్తేనే లారీలు లోడ్ చేస్తున్నారని ఆరోపించారు. అధికారుల పర్యవేక్షణ లేక క్వారీల యాజమాన్యం ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని తెలిపారు.ఇప్పటికైనా జిల్లా కలెక్టర్, మైనింగ్ అధికారులు సమస్య పరిష్కరించాలని కోరారు.

కొండగట్టులో గుర్తు తెలియని వ్యక్తి మృతి

మల్యాల, జూలై 1(ఆంధ్రజ్యోతి): కొండగట్టు స్టేజీ వద్ద గుర్తు తెలియని వ్యక్తి(60) మృతి చెందినట్లు ఎస్సై నరేశ్‌కుమార్ తెలిపారు. తమిళనాడు ప్రాంతం నుంచి వచ్చిన అతను కూలి పనులకు వెళ్తుండేవాడని స్థానికులు తెలిపారు. మంగళవారం బస్టాండ్ ప్రాంతంలో మృతి చెంది ఉండడంతో పోలీసులకు సమాచారం అందించారు. ముత్యంపేట గ్రామపంచాయతీ కారోబార్ రాజేశ్వర్‌రావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

నారు మడిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు



కరీంనగర్ రూరల్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): వరి సాగుకు కరీంనగర్ మండలంలో వాతావరణ పరిస్థితులు బట్టి ఇప్పటికే పలువురు రైతులు నార్లు పోసుకున్నారు. వర్షాలు ప్రస్తుతం సమృద్ధిగా కురుస్తుండటంతో రైతులు సాగుకు సిద్ధమవుతున్నారు. ఈ సమయంలో వరి నారు పెంపకంలో జాగ్రత్తలు పాటించాలని వ్యవసాయ శాఖ అధికారులు సూచిస్తున్నారు. నారు మడిని బాగా దున్ని రెండు నుంచి మూడు సార్లు దుమ్ము చేసి చదును చేయాలి. నీరు పెట్టడానికి తీయడానికి వీలుగా కాలువలు ఏర్పాటు చేసుకోవాలి. రెండు గుంటల నారుమడికి రెండు కిలోల నత్రజని (కిలో విత్తనం చల్లే ముందు, మరో కిలో విత్తిన 12-14 రోజులకు), కిలో భాస్వరం, కిలో పొటాష్‌నిచ్చే ఎరువులను దుక్కిలో వేయాలి. పశువుల పేడా లేదా ఇతర సేంద్రియ ఎరువులను దుక్కిలో వేయాలి.

మొలకొచ్చిన విత్తనాన్ని చల్లి, మొదట్లో (వారం రోజులు) ఆరు తడులు ఇచ్చి తర్వాత మొక్క దశలో పలుచగా నీరు ఉండేలా చూడాలి. లీటర్ నీటికి రెండు గ్రాముల జింక్ సల్ఫేట్ కలిపి పిచికారి చేయాలి. నారు తీసే ఏడు రోజుల ముందు గుంట మడికి 400 గ్రాముల కార్బోఫ్యూరన్ -3జీ గుళికలను ఇసుకలో కలిపి చల్లి పలుచగా నీరు ఉంచాలి. అవసరాన్ని బట్టి మడిలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి. నాటు వేసేందుకు 15 రోజుల ముందు నుంచే పొలాన్ని దుమ్ము చేయాలి.

● నాటు వేసేటప్పుడు..

నాలుగైదు ఆకులున్న నారును నాటుకోవాలి. చౌడు పొలాల్లో లేతనారు వేయవద్దు. నాటిన తర్వాత ప్రతి రెండు మీటర్లకు 30 సెంటీమీటర్ల చొప్పున బాటలు తీస్తే పైరుకు గాలి వెలుతురు బాగా సోకి చీడ పీడల ఉధృతి అదుపులో ఉంటుంది. ముదిరిన నారైతే కుదురుకు 6 నుంచి 8 మొక్కల చొప్పున నాటాలి. ముదురు రంగు నారు నాటిన ప్పుడు నత్రజని ఎరువును సిఫార్సు కంటే 25 శాతం పెంచాలి.

జాతీయ రహదారి పనులు అడ్డగింత

● నష్టపరిహారం పెంచి ఇవ్వాలని రైతు డిమాండ్


చెంజర్లలో అధికారులను వేడుకుంటున్న రైతు కుమార్

మానకొండూర్, జులై 1 (ఆంధ్రజ్యోతి) : మానకొండూర్ మండలంలోని చెంజర్ల గ్రామానికి చెందిన కానిగంటి కుమార్ అనే రైతు తమకు నష్టపరిహారం తక్కువగా ఇచ్చారని రహదారి నిర్మాణ పనులను మంగళవారం అడ్డుకున్నారు. జాతీయ రహదారి 563 నిర్మాణం కోసం జగిత్యాల నుంచి వరంగల్ వరకు అధికారులు భూసేకరణ చేశారు. మానకొండూర్, అన్నారం, ముంజంపల్లి, ఈదులగట్టెపల్లి, చెంజర్ల, గట్టుదుద్దెనపల్లి గ్రామాలకు చెందిన రైతుల భూములను అధికారులు భూసేకరణ చేశారు. ప్రభుత్వం గుంటకు రూ. 63వేలు నష్టపరిహారం కింద పంపిణీ చేసింది. సుడా పరిధిలో లేని గ్రామాలకు రెండు లక్షలకు పైగా చెల్లించిన అధికారులు సుడా పరిధిలో ఉన్న చెంజర్ల గ్రామ రైతులకు రూ.63వేలు చెల్లించారని రైతు ఆవేదన వ్యక్తం చేశారు. రహదారి పనులను అడ్డుకోవడంతో ఆర్డీవో మహేశ్వర్, తహశీల్దార్ విజయ్‌కుమార్, సీఐలు సంజీవ్, సదన్‌కుమార్‌తో పాటు పోలీసులు అక్కడికి చేరుకున్నారు. తనకు న్యాయం జరిగేంత వరకు పనులు చేయనివ్వనని అడ్డుకున్నాడు దీంతో పోలీసులు అతడిని అదుపులోకి తీసుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అనంతరం అధికారులు పనులను కొనసాగించారు.

పట్టా రద్దు చేయాలని కలెక్టర్‌కు వృద్ధురాలి ఫిర్యాదు


ఫిర్యాదు కాపీ చూపుతున్న శాంతమ్మ

శంకరపట్నం, జూలై 1 (ఆంధ్రజ్యోతి): మోసపూరితంగా భూమిని పట్టా చేసుకున్నారని ఆ వ్యక్తి రిజిస్ట్రేషన్ రద్దు చేయాలని కన్నాపూర్ గ్రామానికి చెందిన చింతిరెడ్డి కాంతమ్మ కలెక్టర్‌కు సోమవారం ఫిర్యాదు చేశారు. బాధిరాలు చింతిరెడ్డి శాంతమ్మ మంగళవారం విలేకరుల ఎదుట తమ గోడు వెళ్లబోసుకుంది. శంకరపట్నం మండలం కన్నాపూర్ గ్రామానికి చెందిన చింతిరెడ్డి శాంతమ్మ-పుల్లారెడ్డిలకు సంతానం లేకపోవడంతో దగ్గరి బంధువైన గూడెపు సంతోష్‌రెడ్డి జీవితాంతం మిమ్మల్ని కంటికి రెప్పలా చూసుకుంటామని వృద్ధాప్యంలో అండగా ఉంటానని నమ్మబలికించాడు. అతని మాటలు నమ్మి రిజిస్ట్రేషన్ చేశామని శాంతమ్మ ఆవేదన వ్యక్తం చేశారు. అంతేకాకుండా తమకు డబ్బులు ఇవ్వకుండా, డబ్బులు ఇచ్చి కొనుగోలు చేసినట్లు డాక్యుమెంట్ తయారు చేసి రిజిస్ట్రేషన్ చేసుకున్నాడని ఆరోపించారు. కాగా కొన్నేళ్ల క్రితం తన భర్త పుల్లారెడ్డి మరణించగా, ఒంటరిగా ఉంటున్న శాంతమ్మ ఆలనాపాలన చూసుకోకుండా తమ ఏడెకరాల భూమిని సంతోష్‌రెడ్డి తన పేరిట పట్టా చేయించుకున్నాడని దానిని రద్దు చేయాలన్నారు.

ముగ్గురి బైండోవర్

కరీంనగర్ క్రైం, జూలై 1(ఆంధ్రజ్యోతి): అనుమతి లేకుండా ఇసుకను రవాణా చేస్తున్న కేసులో దర్శనాల లక్ష్మణ్, నాగపురి శ్రీనివాస్, దాసరి వినయ్‌కుమార్‌ను బైండోవర్ చేసినట్లు కరీంనగర్ రూరల్ సీఐ నిరంజన్‌రెడ్డి తెలిపారు. ముగ్గురిని మంగళవారం కరీంనగర్ రూరల్ తహసీల్దార్ ఎదుట హాజరుపర్చినట్లు, సొంత పూచీకత్తుపై విడుదల చేసినట్లు పేర్కొన్నారు.

● తీగలగుట్టపల్లిలో తానిపర్తి శ్రీధర్‌రావు, కేసరి సంపత్‌కుమార్‌లు అనుమానాస్పదంగా తిరుగూ కనిపించగా వారిని అదుపులోకి తీసుకుని తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేసినట్లు సీఐ నిరంజన్‌రెడ్డి తెలిపారు.

పోక్సో కేసులో 10 ఏళ్ల కఠిన కారాగార శిక్ష

సుల్తానాబాద్, జూలై 1 (ఆంధ్రజోతి): పెళ్లి పేరుతో యువతిని లోబరుచుకుని కిడ్నాప్ చేసి వేరే ప్రాంతానికి తీసుకెళ్లి అత్యాచారం చేసిన నేరస్తుడికి పెద్దపల్లి ఫాస్ట్‌ట్రాక్ స్పెషల్ కోర్టు జడ్జి సునిత పదేళ్ల కఠిన కారాగార శిక్షతో పాటు రెండు వేల రూపాయల జరిమానా విధిస్తూ మంగళవారం తీర్పునిచ్చారు. సుల్తానాబాద్ ఎస్ఐ శ్రావణ్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. సుల్తానాబాద్ పట్టణానికి చెందిన ఓ యువతి ఇంటర్ పూర్తి చేసి ఓ ఫ్యాక్టరీలో పనికి వెళుతోంది. రోజూ ఫ్యాక్టరీకి వెళ్తున్న క్రమంలో షేక్ అన్వర్ అలియాస్ కట్ట అన్వర్ ప్రేమిస్తున్నానంటూ యువతి వెంటపడ్డాడు. విషయాన్ని యువతి తల్లికి తెలుపగా కూతురుకు సర్దిచెప్పింది. 2018లో యువతి తల్లి పనికి వెళ్లగా ఇదే అదనుగా భావించిన అన్వర్ యువతి ఇంటికి వెళ్లి ఆటోలో పెద్దపల్లికి అక్కడి నుంచి రైలులో కాగజ్‌నగర్ తీసుకువెళ్లాడు. అక్కడ అన్వర్‌కు తెలిసిన ఒకరి ఇంటిలో యువతితో ఉన్నాడు. పెళ్లి చేసుకుంటానంటూ యువతిని లోబరుచుకున్నాడు. పెళ్లి విషయం దాటవేస్తుండడంతో వారం రోజుల అనంతరం యువతి తల్లికి సమాచారం ఇచ్చింది. తల్లి కాగజ్‌నగర్‌కు చేరుకుని కూతురును తీసుకుని జరిగిన అన్యాయం గురించి పోలీసులను ఆశ్రయించింది. అప్పటి ఎస్ఐ రాజేశ్ కేసు నమోదు చేయగా ఏసీపీ హబీబ్‌ఖాన్ దర్యాప్తు చేశారు. నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్ చేశారు. పెద్దపల్లి ఫాస్ట్ ట్రాక్ కోర్టులో విచారణ జరుగగా ఇరుపక్షాల వాదనలు విన్న జడ్జి సునిత నేరస్తుడు షేక్ అన్వర్‌పై నేరం రుజువు కావడంతో పది సంవత్సరాల కఠిన కారాగార శిక్షతోపాటు రెండు వేల జరిమానా విధించారు. శిక్షపడడంలో పీపీ బాదం రమేష్, పోలీసులు కీలకపాత్ర పోషించారని సీపీ అభినందించారు.

వృద్ధుడి ఆత్మహత్య

జగిత్యాలరూరల్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల రూరల్ మండలం మోరపల్లి గ్రామానికి చెందిన మద్రిపెల్లి చిన్న అంజయ్య (84)అనే వృద్ధుడు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు జగిత్యాల రూరల్ ఎస్సై సధాకర్ తెలిపారు. చిన్న అంజయ్య కొన్ని రోజులుగా అనారోగ్య సమస్యలు, మానసిక సమస్యలతో బాధపడుతున్నాడు. దీంతో జీవితంపై విరక్తి చెంది మంగళవారం తన వ్యవసాయ పొలం వద్ద చెట్టుకు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య మద్రిపల్లి దుబ్బరాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఇంటలిజెన్స్ డీఎస్పీ గౌస్‌బాబాకు ఏఎస్పీగా పదోన్నతి

కరీంనగర్ క్రైం, జూలై 1(ఆంధ్రజ్యోతి): కరీంనగర్ ఇంటలిజెన్స్ డీఎస్పీగా విధులు నిర్వహిస్తున్న గౌస్‌బాబాకు అడిషనల్ ఏఎస్పీగా పదోన్నతి కల్పించారు. కరీంనగర్ ఇంటిలిజెన్స్ ఏఎస్పీ పోస్ట్ కొంత కాలంగా ఖాళీగా ఉండడంతో గౌస్‌బాబా ఇప్పటి వరకు ఇన్‌చార్జిగా విధులు నిర్వహించారు. ఇప్పుడు గౌస్‌బాబాను కరీంనగర్ అడిషనల్ ఎస్పీగా పూర్తిస్థాయి చార్జిని అప్పగిస్తూ నియామక ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఈ సందర్భంగా గౌస్‌బాబాను మంగళవారం ఇంటలిజెన్స్ కరీంనగర్ కార్యాలయంలో టీఎన్‌జీవో జిల్లా అధ్యక్షుడు దారం శ్రీనివాస్‌రెడ్డి, కార్యదర్శి సంగెం లక్ష్మన్‌రావు, గూడ ప్రభాకర్‌రెడ్డి, నాయకులు హర్మిందర్‌సింగ్, రామస్వామి సన్మానించారు.

● జిల్లాకు బదిలీపై వచ్చిన 16 మంది హెడ్‌కానిస్టేబుళ్లు

రాజన్న జోన్-3లో ప్రస్తుతం పని చేస్తున్న హెడ్‌కానిస్టేబుళ్లు 16 మంది కరీంనగర్ పోలీస్ కమిషనరేట్‌కు బదిలీ అయ్యారు. ఈ మేరకు సోమవారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. కరీంనగర్ కమిషనరేట్‌లో కానిస్టేబుళ్లుగా పనిచేసి కొంత కాలం కిందట హెడ్ కానిస్టేబుళ్లుగా పదోన్నతి పొంది ఇతర జిల్లాలకు బదిలీపై వెళ్లారు. కమిషనరేట్‌లో ప్రస్తుతం ఖాళీగా ఉన్న పోస్టులకు వీరిని జిల్లాకు బదిలీ చేశారు.

ఆన్‌లైన్ గేమ్స్ ఆడవద్దని తల్లిదండ్రుల మందలింపు

● ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన యువకుడు ● చికిత్స పొందుతూ మృతి


అజయ్ (ఫైల్)

కమాన్‌పూర్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): పెద్దపల్లి జిల్లా కమాన్‌పూర్ మండల కేంద్రం శివారు పిల్లిపల్లెకు చెందిన అజయ్(24) ఆన్‌లైన్ గేమ్స్‌కు అలవాటుపడ్డాడు. ఆడవద్దని తల్లిదండ్రులు మందలించడంతో ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. పిల్లి అజయ్ హైదరాబాద్‌లో బీటెక్ చదువుతున్నాడు. సెల్‌ఫోన్‌లో ఆన్‌లైన్ గేమ్స్ ఆడుతూ లక్షల రూపాయలు నష్టపోయాడు. తల్లిదండ్రులు వద్దని వారిస్తే రెండేళ్ల క్రితం ఇంటినుంచి వెళ్లిపోయాడు. అతన్ని ఇంటికి తీసుకురాగా మళ్లీ ఆన్‌లైన్ గేమ్స్ ఆడుతుండటంతో వద్దని మందలించారు. దీంతో గత నెల 29న గుండారం-రాజాపూర్ శివారులో గడ్డి మందు తాగి స్నేహితులకు ఫోన్‌చేసి చెప్పాడు. అజయ్ కుటుంబ సభ్యులు హుటాహుటిన పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్ తరలించగా చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. అజయ్ తండ్రి మల్లయ్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

పండ్ల ఆటో బోల్తా


రోడ్డుపై పడిపోయిన పండ్లు

కోరుట్ల, జూలై 1 (ఆంధ్రజ్యోతి) : కోరుట్ల పట్టణంలోని జాతీయ రహదారిపై మంగళవారం అల్‌బుకార్ పండ్లు తరలిస్తున్న ఆటో బోల్తా పడింది. పట్టణంలోని అయిలాపూర్ ఎక్స్‌రోడ్డు నుంచి జాతీయ రహదారిపైకి అతి వేగంగా డ్రైవర్ ఆటోను నడపడంతో అదుపుతప్పి బోల్తా కొట్టింది. పండ్లు కింద పడిపోవడంతో స్థానిక వ్యాపారులు సహాయం చేసి పండ్లను పెట్టెలలో ఎత్తారు. సంఘటనలో ఆటో పూర్తిగా ధ్వంసం కాగా డ్రైవర్‌కు గాయాలయ్యాయి.


రాష్ట్ర స్థాయి కిక్ బాక్సింగ్ పోటీల్లో జిల్లాకు పతకాలు


పతకాలు సాధించిన విద్యార్థులు

సిరిసిల్ల టౌన్, జూలై 1 (ఆంధ్రజ్యోతి) : మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో జూన్ 28, 29న జరిగిన రాష్ట్ర స్థాయి కిక్ బాక్సింగ్ పోటీల్లో రాజన్న సిరిసిల్ల జిల్లాకు పతకాలు వచ్చాయి. రాష్ట్ర స్థాయి కిక్ బాక్సింగ్ పోటీలలో బంగారు, వెండి, కాంస్య పతకాలను సాధించిన జిల్లా విద్యార్థులు జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు మంగళవారం సిరిసిల్లలో కిక్ బాక్సింగ్ కోచ్ వొడ్నాల శ్రీనివాస్ తెలిపారు. రాష్ట్ర స్థాయి పోటీలకు జిల్లా నుంచి 20 మంది విద్యార్థులు వెళ్లగా కిక్ బాక్సింగ్ పలు విభాగాలలో బంగారు, వెండి, కాంస్య పతకాలను సాధించారు. ఎలగందుల శ్రీనివాస్, గంగనవేణి ప్రవళిక, అన్నాల్‌దాస్ లక్ష్మీప్రసన్న, బోయిన లోకేష్, ఏర్నాల రాజశేఖర్, గజ్జెల శ్వేదిక, కర్నె యతిక, గౌతమ్, ఆనందర్, శివష్, కొండ శ్రీరామ్, గజ్జెల హిరణ్య, షేక్ అజహన్‌లు జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు పేర్కొన్నారు.

తమిళనాడు రాష్ట్రం చెన్నయ్‌లో జరగనున్న జాతీయ స్థాయి కిక్ బాక్సింగ్ పోటీలలో ఎంపికైన జిల్లా విద్యార్థులు పాల్గొంటారని వారు తెలిపారు.

జీతాలు ఇవ్వండి మహాప్రభో



3 నెలలుగా డీడీఎన్ అర్చకులకు అందని వేతనాలు


ఉమ్మడి జిల్లాలో 898 ఆలయాల అర్చకులు

కరీంనగర్ కల్చరల్, జూలై 1 (ఆంధ్రజ్యోతి) : గ్రామీణ ప్రాంతాల్లో ధూపదీప, నైవేద్య పథకం కింద (డీడీఎన్) పనిచేసే దేవాలయాల అర్చకులకు మార్చి, ఏప్రిల్‌తో పాటు జూన్ మాసాన్ని కలుపుకుంటే మూడు నెలలుగా జీతాలు రాలేదు. దీంతో వారు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రాష్ట్ర ప్రభుత్వం అర్చకులకు గౌరవ భృతి కింద రూ.6 వేలు, ధూపదీపాలు, హారతి, నైవేద్యానికి రూ.4 వేల చొప్పున మొత్తం 10 వేలు చెల్లిస్తుండగా ఇప్పటివరకు అకౌంట్‌లలో జమ కాలేదు. కరీంనగర్ ఉమ్మడి జిల్లాలో 898 ఆలయాల అర్చకులు జీతాల కోసం ఎదురు చూస్తున్నారు. ఉదయం, సాయంత్రం పూజలు, పునస్కారాలతో ఆలయాలనే నమ్ముకొని బతుకుతున్న వారికి నిత్యం పూట గడవడం కష్టంగా ఉంది. చిన్నచిన్న ఆలయాలకు భక్తుల తాకిడి తక్కువగా ఉండడంతో దేవుడి కైంకర్యాలకు అంతరాయం ఏర్పడుతోంది. విశేష రోజులు, ఉత్సవాలు, పండుగలు వస్తే ధూపదీప నైవేద్యాలకు మరింత ఖర్చు చేయాల్సి వస్తుంది. ఒక వేళ దాతలు, గ్రామ పెద్దలు సహాయం చేస్తే తప్ప ధూప దీప నైవేద్యాలు గడిచే పరిస్థితి. గుడినే నమ్ముకున్న అర్చకులు కూలీ చేయలేక, కుటుంబ అవసరాలకోసం అప్పులు కూడా చేస్తున్నట్లు సమాచారం.

నెలల తరబడి వేతనాలు రాకపోవడంతో నిత్యావసర సరుకులతో పాటు పిల్లల పుస్త కాలు, ఫీజులు చెల్లించేందుకు, రోగాలకు మందులు కొనుక్కునేందుకు అవస్థలు పడుతున్నారు. కనీసం శుభ కార్యాలతోనైనా వెళ్లదీద్దామనుకుంటే రెండు నెలలుగా ముహూర్తాలు లేవు. ప్రస్తుతం ఆషాడమాసం నడుస్తోంది. దీంతో ఈ ఆధారం కూడా లేకుండా పోయింది. ప్రభుత్వాలు మారినా వేతనాల చెల్లింపుల విషయంలో ప్రతీసారి ఇదే పరిస్థితి నెలకొంటోది. ఆలస్యానికి కారణమడిగితే అధికారులు బడ్జెట్ రాలేదని చెబుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. డీడీఎన్ కింద తొలుత ప్రభుత్వం రూ.2500 చెల్లించేది. ఆ తర్వాత బీఆర్ఎస్ ప్రభుత్వం రూ.6వేలకు, తర్వాత రూ.10వేలకు పెంచింది. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే రూ.12 వేలకు పెంచుతామని ఎన్నికలకు ముందు ప్రకటించింది. ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర గడుస్తున్నా ఆ ఊసే లేదు. వేతనాలు పెంచాలని, సకాలంలో అందించాలని అర్చక సంఘాల నాయకులు ప్రభుత్వానికి పలు మార్లు విజ్ఞప్తి చేసినా, వినతి పత్రాలు సమర్పించినా స్పందన లేదు. ఇప్పటికైనా వేతన పెంపుతోపాటు సకాలంలో జీతాలు అందేలా చర్యలు తీసుకోవాలని, తమ కుటుంబాలను ఆదుకోవాలని అర్చకులు కోరుతున్నారు.

పెద్ద ఆలయాల నుంచి కంట్రిబ్యూషన్ రావాలి

గంగు ఉపేంద్రశర్మ, రాష్ట్ర అర్చక, ఉద్యోగ జేఏసీ చైర్మన్



పెద్ద ఆలయాల నుంచి కంట్రిబ్యూషన్ వస్తే చిన్న ఆలయాల అర్చకులకు వేతనాలు చెల్లించాలని నిర్ణయించారు. ఏటా రూ.26 కోట్ల బడ్జెట్ అర్చక వెల్ఫేర్ అసోసియేషన్‌కు రావాలి. వేతనాలు ప్రస్తుతం ఫైనాన్స్ డిపార్ట్‌మెంట్‌తో ముడి పడి ఉన్నాయి. జిల్లాల అధికారులు ప్రతీ నెలా 20వ తేదీ లోపు బిల్లులు పంపాలి. త్వరలో వేతనాలు వస్తాయి.

అర్చకులకు ఇబ్బంది: నిట్టూరి సతీశ్‌శర్మ, డీడీఎన్ అర్చక సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు



వేతనాలు సకాలంలో అందకపోతే అర్చకులకు అనేక ఇబ్బందులు తప్పవు. సంఘం తరపున దేవాదాయశాఖ మంత్రి, అధికారులను కలిశాం. ఫైనాన్స్ కమిషన్ నుంచి ఉత్తర్వులు రాగానే వేతనాలు పడతాయని చెప్పారు. ప్రతీ నెలా వేతనాలు అందేలా నాయకులు, అధికారులతో మాట్లాడుతాం. అర్చకుల అవస్థలపై వివరించే ప్రయత్నం చేస్తాం.

శతాధిక వృద్ధురాలు మృతి


రాజవ్వ (ఫైల్)

చందుర్తి జూలై 1 (ఆంధ్రజ్యోతి): చందుర్తి మండలం బండపల్లి గ్రామంలో గసిగంటి రాజవ్వ(110) అనే శతాధిక వృద్ధురాలు మృతిచెందింది. గ్రామస్థుల కథనం ప్రకారం... రాజవ్వ రెండు రోజుల నుంచి అనారోగ్యానికి గురై సోమవారం రాత్రి మృతిచెందినట్లు తెలిపారు. రాజవ్వకు నలుగురు కుమారులు, నలుగురు కుమార్తెలు, 19 మంది మనవళ్లు, మనవరాళ్లు ఉన్నారు. ఇప్పటి వరకు రాజవ్వ ఆమె పనులు ఆమె చేసుకుంటూ ఉండేదని కుటుంబ సభ్యులు, స్థానికులు తెలిపారు. రాజవ్వ నలుగురు కుమారులు, ఇద్దరు కుమార్తెలు మృతిచెందినట్లు పేర్కొన్నారు. ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. చిన్న కుమార్తె అంత్యక్రియలు నిర్వహించారు.

యువతి అదృశ్యం

తంగళ్లపల్లి, జూలై 1 (ఆంధ్రజ్యోతి): తంగళ్లపల్లి మండల కేంద్రంలోని ఇందిరానగర్‌కు చెందిన మోతే రాధిక అనే యువతి సోమవారం అదృశ్యమైంది. ఇందిరనగర్‌కు చెందిన మోతే రేణుక-కనకయ్యల కూతురు రాధిక సోమవారం సాయంత్రం నుంచి కనిపించకుండా పోయిందని తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఉపేంద్ర చారి తెలిపారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్ అప్పగింత

ధర్మపురి, జూలై 1 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి పట్టణానికి చెందిన కటుకం భూమయ్య అనే యువకుడు గత నెల 8న తన సెల్‌ఫోన్ పోగొట్టుకోగా పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ధర్మపురి పోలీసులు వెంటనే వివరాలు సీఈఐఆర్ పోర్టల్‌లో నమోదు చేశారు. సెల్‌ఫోన్ ఆచూకీ తెలుసుకుని భూమయ్యకు అప్పగించినట్లు హెడ్‌కానిస్టేబుల్ పులి రవికుమార్ తెలిపారు.

తెరుచుకున్న బాబ్లీ గేట్లు

ఎస్సారెస్పీకి పెరగనున్న వరద



బాబ్లీ గేట్లు ఎత్తడంతో వస్తున్న వరద నీరు

జగిత్యాల, జూలై 1 (ఆంధ్రజ్యోతి): మహారాష్ట్రంలో గోదావరి నదిపై గల బాబ్లీ ప్రాజెక్టు గేట్లు తెరుచుకున్నాయి. మంగళవారం బాబ్లీ ప్రాజెక్టు, శ్రీరాంసాగర్ ప్రాజెక్టు అధికారుల సమక్షంలో బాబ్లీ ప్రాజెక్టు గేట్లను ఎత్తి నీటిని దిగువకు వదిలారు. శ్రీరాంసాగర్ ప్రాజెక్టు బ్యాక్ వాటర్‌లో గోదావరి నదిపై మహారాష్ట్ర సర్కారు నిర్మించిన బాబ్లీ ప్రాజెక్టు గేట్లను గతంలో సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాల ప్రకారం జూలై 1వ తేదీ నుంచి ఎత్తి నీటిని వదిలారు. నాలుగు నెలల పాటు బాబ్లీ ప్రాజెక్టు గేట్లు తెరుచుకొని ఉంచి వచ్చిన నీరును వచ్చినట్లుగానే దిగువలోకి వదలనుండడంతో రానున్న రోజుల్లో ఎస్సారెస్పీలోకి వరద నీరు వచ్చి చేరనుంది. అక్టోబరు 28 వరకు బాబ్లీ గేట్లను ఎత్తి ఉంచనున్నారు. బాబ్లీ గేట్లు తెరుచుకునే పనులను పరిశీలించడానికి ఎస్సారెస్పీ అధికారుల బృందం మహారాష్ట్రలోని బాబ్లీ ప్రాజెక్టును సందర్శించింది. బాబ్లీని సందర్శించిన అధికారుల బృందంలో సీడబ్ల్యూసీ ఈఈ ఎంఎల్ ఫ్రాంక్లిన్, పోచంపాడ్ ఎస్ఈ శ్రీనివాస్ గుప్త, ఈఈ చక్రపాణి, నాందేడ్ బాబ్లీ ఈఈ బాన్సోడ్, పోచంపాడ్ ఏఈఈ కొత్త రవి, పలువురు బాబ్లీ డ్యామ్, శ్రీరాంసాగర్ ప్రాజెక్టు అధికారులు తదితరులున్నారు.

సహకార సంఘాల సేవలను సద్వినియోగం చేసుకోవాలి

చొప్పదండి, జూలై 1 (ఆంధ్రజ్యోతి): సహకార సఘాలను సేవలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా సహకార శాఖ అధికారి రామానుజచార్యులు అన్నారు. మంగళవారం చొప్పదండి ప్యాక్స్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ సహకార వారోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2025 సంవత్సరాన్ని ఐక్యరాజ్య సమితి సహకార సంవత్సరంగా గుర్తించడం శుభపరిణామమని అన్నారు. సహకార సంఘాల అవసరాన్ని విస్తృతంగా రైతులకు చేరవేయాలని, సంఘం ద్వారా రైతులకు కావాల్సిన స్వల్ప కాలిక, దీర్ఘకాలిక రుణాలను, ఎరువులను, పురుగు మందులను సకాలంలో అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్యాక్స్ చైర్మన్ వెల్మ మల్లారెడ్డి, క్రిబ్‌కో కంపెనీ జిల్లా మేనేజర్ ప్రేమ్ తేజ్, ఏరియా మేనేజర్ నవీన్ కుమార్, సంఘం ఉపాధ్యక్షులు ముద్దం మహే శ్‌గౌడ్, సీఈవో కళ్లెం తిరుపతిరెడ్డి, డైరెక్టర్లు కళ్లెం లక్ష్మారెడ్డి గుర్రం ఆనందరెడ్డి, మంగళారపు మల్లారెడ్డి, నాంపల్లి మల్లయ్య, మాజీ సహకార అధికారి గుర్రం ఇంద్రసేనారెడ్డి, రైతులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి తైక్వాండో పోటీల్లో పతకాలు



పతకాలు సాధించిన క్రీడాకారులను అభినందిస్తున్న డీవైఎస్‌వో శ్రీనివాస్‌గౌడ్

కరీంనగర్ స్పోర్ట్స్/ చొప్పదండి, జూలై 1 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాఖండ్‌లోని హరిద్వార్‌లో జూన్ 23, 24, 25 తేదీల్లో నిర్వహించిన జాతీయ స్థాయి జూనియర్స్ తైక్వాండో చాంపియన్‌షిప్ పోటీల్లో ఉమ్మడి జిల్లా క్రీడాకారులు పతకాలను సాధించినట్లు ఉమ్మడి జిల్లా తైక్వాండో అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు మెహర్, సంతోష్ ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి జిల్లా నుంచి రాష్ట్ర జట్టుకు ప్రాతినిధ్యం వహించిన క్రీడాకారులు మొత్తం ఏడు స్వర్ణం, ఒక రజత పతకం సాధించినట్లు పేర్కొన్నారు. క్రీడాకారులను జిల్లా యువజన, క్రీడాశాఖ అధికారి శ్రీనివాస్‌గౌడ్ అభినందించారు. భవిష్యత్‌లో అంతర్జాతీయ స్థాయికి ఎదగాలని సూచించారు. కార్యక్రమంలో తైక్వాండో సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు పెండ్లి రాజేశం, కోచ్ హరి, శ్రీజ, రమ్య, నాగమణి, అంజలి పాల్గొన్నారు.

జాతీయస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు ఏఆర్ కానిస్టేబుల్



కరీంనగర్ స్పోర్ట్స్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): జాతీయస్థాయి మహిళల హ్యాండ్‌బాల్ పోటీలకు ఏఆర్ కానిస్టేబుల్ మాధవి ఎంపికయ్యారని హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ఉమ్మడి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వీర్ల వెంకటేశ్వర్‌రావు, బసరవేణి లక్ష్మణ్ తెలిపారు. రామగుండం కమిషనరేట్‌లో విధులు నిర్వహిస్తున్న మాధవి రాష్ట్ర జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తున్నట్లు చెప్పారు. గుజరాత్‌లోని భుజ్‌లో ఈ పోటీలు జరుగుతున్నాయన్నారు. ఈ సందర్భంగా మాధవిని సంఘం రాష్ట్ర కార్యదర్శి శ్యామల పవన్ కుమార్, డీవైఎస్‌వో శ్రీనివాస్‌గౌడ్, ఒలింపిక్ సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నందెల్లి మహిపాల్, గసిరెడ్డి జనార్దన్‌రెడ్డి అభినందించారు.

రైతుల కోసం పలు యాప్‌లు



- వర్షాలపై ముందస్తు సమాచారం
- ఎప్పటికప్పుడు వాతావరణ వివరాల అందజేత

చొప్పదండి, జూలై 1 (ఆంధ్రజ్యోతి): వర్షాలు ఎప్పుడుపడతాయో, వాతావరణం ఎప్పుడు మారుతుందో రైతులకు తెలియక నష్టపోతున్నారు. వరుణుడి కోసం ఎదురుచూస్తూ పంటల సాగును చేపడుతున్నారు. ముందస్తు వాతావరణ సూచనలు, సలహాలు తెలియక అకాల వర్షాలు, భారీ వర్షాలు కొన్ని సందర్భాల్లో పంటలను దెబ్బతీస్తున్నాయి. పిడుగులు పడి వ్యవసాయ పనులకు వెళ్లిన రైతులు మృత్యువాత పడుతున్నారు. ఈ నేపథ్యంలో రైతులకు సకాలంలో వాతావరణ సూచనలు, వర్షాలు, పిడుగుల సమాచారం అందించేందుకు కేంద్ర ప్రభుత్వం వ్యవసాయ మంత్రిత్వ శాఖతోపాటు ఎర్త్ సైన్సెస్ మంత్రిత్వ శాఖలు ఐఎండీ, ఐకార్ సహకారంతో పలు యాప్‌లను రూపొందించింది. మేఘదూత్, కిసాన్ సువిధ, రెయిన్ అలారం, దామిని యాప్‌లను రైతులకు అందుబాటులోకి తీసుకువచ్చింది. ఈ యాప్‌ల ద్వారా రైతులకు ఎప్పటికప్పుడు వాతావరణ సమాచారం తెలుసుకోవచ్చు. కొన్ని యాప్‌లు ముందస్తు సమాచారాన్ని కూడా అందిస్తున్నాయి. ఈ నేపథ్యంలో రైతుల కోసం ప్రత్యేక కథనం...

సమాచారం తెలుగులోనూ అందుబాటులో ఉంది..



వంశీకృష్ణ, మండల వ్యవసాయ అధికారి, చొప్పదండి

రైతులు పంటలు సాగు చేసే సమయంలో వాతావరణ సమాచారం ఎంతో అవసరం. వాతావరణ వివరాలను తెలిపే యాప్‌లను సద్వినియోగం చేసుకోవాలి. ఈ యాప్‌లలో సమాచారం తెలుగులోనూ అందుబాటులో ఉంది.

● మేఘదూత్‌తో నాలుగు రోజుల ముందే సమాచారం...



మేఘదూత్ యాప్‌లో రానున్న నాలుగు రోజుల వాతావరణ సమాచారాన్ని రైతులు ముందే తెలుసుకోవచ్చు. ఈ యాప్‌లో వారం క్రితం నాటి సమాచారంతోపాటు ప్రస్తుత సమయంలో ఉష్ణోగ్రత, వర్షపాతం, గాలి వేగం సమాచారాన్ని యాప్ ద్వారా పొందవచ్చు. ఇతర ప్రాంతాలకు ప్రయాణం చేసే వారు కూడా ఈ యాప్ ద్వారా ముందస్తు సమాచారాన్ని తెలుసుకోవచ్చు.

● వర్ష సూచనకు రెయిన్ అలారం, కిసాన్ సువిధ



వివిధ ప్రాంతాల్లో వర్ష సూచనలను నిరంతరం తెలుసుకునేందుకు రెయిన్ అలారం, కిసాన్ సువిధ యాప్‌ల ద్వారా తెలుసుకునే అవకాశం ఉంది. ఐదు రోజుల ముందస్తు హెచ్చరికలను ఈ యాప్‌లో అందుబాటులో ఉన్నాయి. వాతావరణంతోపాటు మార్కెట్ ధరలు, పంటల బీమా సమాచారం, విత్తనాలు, ఎరువులు, నీటి నిర్వహణపై పలు సూచనలు ఈ యాప్‌లలో రైతులకు అందుబాటులో ఉన్నాయి. అన్ని భాషలతోపాటు తెలుగులో కూడా ఈ యాప్‌లు అందుబాటులో ఉన్నాయి. ఈ యాప్‌లను రైతులు ప్లే స్టోర్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.

● దామిని ద్వారా పిడుగుల సమాచారం..



ఉరుములు, మెరుపులు, పిడుగులకు సంబంధిం చిన సమాచారాన్ని దామిని యాప్ ద్వారా తెలుసుకోవచ్చు. పిడుగులు ఎక్కడ పడే అవకాశం ఉందో ఈ యాప్ సమాచారం అందిస్తుంది. పిడుగు పడే సమ యంలో రైతులు తగు జాగ్రత్తలు తీసుకుని రక్షణ పొందవచ్చు. పిడుగు పడే వాతావరణం ఉన్నప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు ఈ యాప్‌లో అందు బాటులో ఉంటాయి.

అంజన్న సన్నిధిలో భక్తుల సందడి



ఆలయ ఆవరణలో భక్తులు

మల్యాల, జూలై 1 (ఆంధ్రజ్యోతి): కొండగట్టు ఆంజనేయస్వామి సన్నిధిలో మంగళవారం భక్తుల సందడి నెలకొంది. వేలాదిగా భక్తులు స్వామి వారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. భక్తులు అంజన్నతో పాటు బేతాళుడు, శ్రీరాముల వారిని కూడా దర్శించుకున్నారు. వేకువ జాము నుంచి కురిసిన ముసురు వర్షం భక్తులకు అసౌకర్యం కలిగించింది. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా అధికారులు పర్యవేక్షించారు.

భాషా సాంస్కృతిక శాఖ సలహాదారుల

కమిటీ సభ్యుడిగా కిశోర్



హుజూరాబాద్, జూలై 1(ఆంధ్రజ్యోతి): హుజూ రాబాద్ పట్టణానికి చెందిన నేర్నాల కిశోర్‌ను తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సలహాదారుల కమిటీ సభ్యుడిగా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. కిశోర్ నియామకం పట్ల హుజూ రాబాద్ నగారే బృందం చొల్లేటి రాజన్న, పిట్టల శ్రీనివాస్, మురళీ మధు, వడ్లకొండ అనిల్, బాబ్జీ, డప్పు సురేష్ తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

బోడకాకర కిలో రూ.400



(ఆంధ్రజ్యోతి, సిరిసిల్ల)

ఎన్నో పోషకాలు, కావాల్సినన్ని విటమిన్లు అందించే బోడకాకర ధర కూడా భయపెడుతోంది. మంగళవారం సిరిసిల్ల మార్కెట్‌లో కిలో రూ.400 ధర పలికింది. వర్షాకాలంలో మాత్రమే కనిపించే బోడకాకర చాలా తక్కువగా మార్కెట్‌లోకి వస్తుంటుంది. దీంతో ఎక్కువ ధర అయినా ప్రజలు కొనడానికి ముందుకు వస్తారు. గతేడాది ఇదే సీజన్‌లో రూ.200 కిలో ఉన్న బోడకాకర ఈ ఏడాది రూ 400లకు చేరడంతో కొనాలని ఉన్నా ధరలు భయపెడుతున్నాయి.

ఔషధ గుణాలు ఎన్నో..

బొంతకాకర, అడవికాకర, ఆగాకార పేర్లతో పిలిచే బోడకాకరలో ఎన్నో ఔషధ గుణాలు ఉన్నాయి. ఇందులో బీ1, బీ2, బీ3, బీ5, బీ6, బీ9, బీ 12 విటమిన్‌లతో పాటు ఏ, సీ, డీ2, డీ3, కాల్షియం, మెగ్నీషియం, పొటాషియం, సోడియం, విటమిన్ హెచ్, కే, కార్బొహైడ్రేట్లు, ఫైబర్, కాపర్, జింక్ ప్రొటీన్‌లు ఉన్నాయి.

బోడకాకర తలనొప్పి, జుట్టు రాలడం, చెవినొప్పి, దగ్గు, కడుపులో ఇన్‌ఫెక్షన్లు రాకుండా చూస్తుంది. డయాబెటిక్ రోగులకు ఎంతో ఉపయోగ కరంగా ఉంటుంది. వర్షాకాలంలో వచ్చే ఎలర్జీని కూడా దూరం చేస్తుంది. పక్షవాతం, కంటి సమస్యలు, రక్తపోటు, క్యాన్సర్, కిడ్నీలో రాళ్లు రాకుండా కూడా దోహదపడుతుంది. గర్భిణులు బోడకాకర తింటే శిశువు ఎదుగుదలకు కూడా ఉపయోగపడుతుందని వైద్యులు చెబుతున్నారు.

ఆశ్రమ పాఠశాలకు ఆదరణ కరువు

అన్ని వసతులున్నా పిల్లలను చేర్పించని తల్లి దండ్రులు



చిత్రవేణిగూడెం బాలుర ఆశ్రమ పాఠశాల

బీర్‌పూర్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిత్రవేణి గూడెం బాలుర ఆశ్రమ పాఠశాలకు ఆదరణ కరువైంది. ఈ పాఠశాలలో మూడో తరగతి నుంచి ఎనిమిదో తరగతి వరకు చదువుకునే విద్యార్థులు 40 మంది ఉన్నారు. ప్రధానోపాధ్యాయుడు, ముగ్గురు సీఆర్‌టీలు, ముగ్గురు వాలంటీర్లు ఉన్నారు. ఈ పాఠశాలలో అన్ని సౌకర్యాలు ఉన్నాయి. అయినా మండలంలోని గిరిజన విద్యార్థులు పాఠశాలలో చేరడం లేదు. మండలంలో రంగాసాగర్, చెర్లపల్లి, కండ్లపల్లి, మంగేళ, తాళ్లధర్మారం, చిత్రవేణిగూడెం, చిన్న కొల్వాయి, తుంగూర్, కోమన్‌పల్లి, కందెనకుంట, బీర్‌పూర్, సారంగాపూర్ మండలంలో బట్టపల్లి-పోతారం, సారంగా పూర్, రేచపల్లి, లక్ష్మీదేవిపల్లి, అర్పపల్లి గ్రామాల్లో గిరిజన విద్యార్థులు ఉన్నారు. అధికారులు ఆశ్రమ పాఠశాల గురించి అవగాహన కల్పించకపోవడంతో విద్యార్థులు చేరడం లేదు. సమీపంలో అన్ని వసతులతో కూడిన ఆశ్రమ పాఠశాలలు ఉండగా దూర ప్రాంతాలకు వెళ్లి చదువుకుంటున్నారు.

అడ్మిషన్ల కోసం ఉపాధ్యాయుల తిప్పలు

స్థానిక విద్యార్థులు చేరకపోవడంతో ఆశ్రమ పాఠశాల సిబ్బంది పొరుగు జిల్లాలైన ఆదిలాబాద్, మంచిర్యాల ప్రాంతాల కు చెందిన విద్యార్థులను చేర్చుకుంటున్నారు. అధికారులు స్పందించి మండలంలోని మంగేళ గ్రామంలో ఉన్న బాలికల గిరిజన పాఠశాలపై, చిత్రవేణి గూడెంలో ఉన్న బాలుర ఆశ్రమ పాఠశాలపై గిరిజనుకు అవగాహన కల్పించి విద్యార్థులను చేర్పించేందుకు కృషి చేయాలని మండల ప్రజలు కోరుతున్నారు.

విద్యార్థుల తల్లిదండ్రులు పిల్లలను చేర్పించాలి



శ్రీనివాస్, ప్రధానోపాధ్యాయుడు

ఆశ్రమ పాఠశాలను తల్లిదండ్రులు ఒక్క సారి సందర్శించి పాఠశాలలో వసతులు, ఆహారాన్ని, పరిసర ప్రాంతాలను పరిశీలించాలి. అన్ని సౌకర్యాలు ఉన్నాయి. విద్యార్థులకు మంచి విద్యను అందిస్తున్నాం. తల్లిదండ్రులు తమ పిల్లలను ఆశ్రమ పాఠశాలలో చేర్పించాలి.

నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని అలవర్చుకోవాలి

జ్యోతినగర్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): ఎన్టీపీసీ అధికారులు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని రామగుండం ఎన్టీపీసీ ఈడీ చందన్ కుమార్ సామంత అన్నారు. మంగళవారం ఈడీసీ మిలీనియం హాల్‌లో అధికారులకు మొదటిసారి కృత్రిమ మేథస్సుపై వర్క్‌షాప్ నిర్వ హించారు. వర్క్‌షాప్‌ను ప్రారంభించిన అనంతరం ఈడీ ప్రసంగిస్తూ సిబ్బంది ఎప్పటికప్పుడు తమను తాము అప్‌గ్రేడ్ చేసుకోవాల్సిన అ వసరం ఉందన్నారు. ఏఐ సాంకేతిక పరిజ్ఞానం తమ రోజువారి వృత్తిలో ఎంతో ఉపక రిస్తుందని తెలిపారు. సోషల్ మీడియా కన్సల్టెంట్, డిజిట్ మార్కెటింగ్ ప్రొఫెసర్ కిరుబా శంకర్ కృత్రిమ మేథస్సు ప్రాధాన్యం, ఆచరణ, ప్రయోజనాలు



ఏఐ వర్క్‌షాప్‌లో పాల్గొన్న ఎన్టీపీసీ అధికారులు

తదితర అంశాలపై అధికారులకు అవగాహన కల్పించారు. ఏఐతో కమ్యూనికేషన్ రంగంలో వచ్చే విప్లవాత్మక మార్పులపై వివరించారు. వర్క్‌షాప్‌లో జీఎం మనోజ్ ఝా, ఏజీఎం హెచ్‌ఆర్ విజయ్‌కుమార్ సిక్దర్, అధికారులు, కమ్యూనికేషన్ అధికారులు(పీఆర్), సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్టీపీసీ జీఎంకు సీజీఎంగా పదోన్నతి

ఎన్టీపీసీ ఆపరేషన్స్ అండ్ మెయింటెనెన్స్ జీఎం అలోక్‌కుమార్ త్రిపాఠికి పదోన్నతి లభించింది. త్రిపాఠికి చీఫ్ జనరల్ మేనేజర్(సీజీఎం)గా ప్రమోషన్ కల్పిస్తూ మంగళవారం కార్పొరేట్ సెంటర్ ఉత్తర్వులు జారీ చేసింది. పదోన్నతి లభించినప్పటికీ ఆయన ఇక్కడి ప్రాజెక్టులోనే పని చేయనున్నారు.

ప్రమాదకరంగా లో లెవెల్ వంతెనలు



అర్కండ్ల లో లెవెల్ బ్రిడ్జిపై ఉధృతంగా ప్రవహిస్తున్న నీరు (ఫైల్)



అర్కండ్లలోని లెవెల్ బ్రిడ్జి

శంకరపట్నం, జూలై 1 (ఆంధ్రజ్యోతి): ఏళ్లు గడుస్తున్నాయి.. ప్రభుత్వాలు మారుతున్నాయి.. సమస్యలపై ప్రజలు, ప్రభుత్వ యంత్రాంగానికి విన్నవిస్తున్నారు. కానీ సమస్యలు మాత్రం పరిష్కారం కావడం లేదు. వర్షాకాలంలో వాగులు ఉప్పొంగిలో లెవల్ బ్రిడ్జిల పైనుంచి నీరు ప్రవహించడంతో వాగు దాటాలంటే ఇబ్బందులు పడాల్సి వస్తోంది. వాగు ఉప్పొంగినపుడు తరచుగా ప్రమాదాలు జరుగుతున్నాయి. వాగులపై బ్రిడ్జిలు నిర్మించాలని ప్రజలు ఏళ్లుగా కోరుతున్నా ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదు.

అర్కండ్ల బ్రిడ్జిపై అవస్థలు

శంకరపట్నం మండలం అర్కండ్ల-కన్నాపూర్ గ్రామాల మధ్య అర్కండ్ల వాగుపై ఉన్న లో లెవెల్ బ్రిడ్జి వర్షాకాలంలో భారీ వర్షాలు కురిసినప్పుడు ప్రమాదకరంగా మారుతుంది. వర్షాకాలంలో బ్రిడ్జిపై నుంచి నెలల తరబడి నీరు ప్రవహిస్తూ ఉంటుంది. అర్కండ్ల గ్రామ ప్రజలు వ్యవసాయ పనుల నిమిత్తం ప్రతిరోజు బ్రిడ్జి దాటి రావాల్సి ఉంటుంది. భారీ వర్షాలు కురిసినప్పుడు బ్రిడ్జిపై నీరు ఉధృతంగా ప్రవహించడంతో గ్రామస్థులు కొన్ని రోజుల పాటు పొలాల వద్దకు రావడానికి అనేక ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుంది. అంతేకాక వీణవంక మండలం చల్లూరు నుంచి శంకరపట్నం మండలం కేశవపట్నం ఎన్‌హెచ్-563 రహదారి వరకు 13 కిలో మీటర్ల మేర రూ. 17 కోట్లతో బ్రిడ్జి మీద గుండా బీటీ రోడ్డు నిర్మించారు.

వీణవంక మండలంలోని పలు గ్రామాలు ఈ దారి మీదుగా కేశవపట్నం చేరుకోవడానికి అనువుగా ఉంటుంది. వర్షాకాలం వస్తే అర్కండ్లలో లెవెల్ బ్రిడ్జిపై నుంచి నీరు ప్రవహించడంతో భారీ వాహనాలు తప్ప చిన్న వాహనాల రాకపోకలకు నెలల తరబడి అంతరాయం ఏర్పడుతుంది. వర్షాకాలంలో బ్రిడ్జిపై నాచు పట్టి జారే స్వభావం కలిగి ఉండడంతో వాహనదారులు ప్రమాదాల బారిన పడిన ఘటనలున్నాయి. చల్లూరు నుంచి కేశవపట్నం జాతీయ రహదారి వరకు రూ. 17 కోట్లతో రోడ్డు నిర్మించారు. కానీ అర్కండ్ల వాగుపై బ్రిడ్జి నిర్మించకపోవడంతో వర్షాకాలంలో రాకపోకలకు అంతరాయం కలుగుతుందని ప్రజలు ఆవేదన చెందుతున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే చొరవ తీసుకొని అర్కండ్ల వాగుపై బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.



పాపయ్యపల్లె నుంచి కేశవపట్నం వెళ్లే లో లెవెల్ బ్రిడ్జి (ఫైల్)

పాపయ్యపల్లె లో లెవెల్ బ్రిడ్జి

కేశవపట్నం గ్రామపంచాయతీ పరిధిలోని పాపయ్యపల్లె గ్రామానికి వెళ్లే దారిలో వాగుపై లో లెవెల్ బ్రిడ్జి నిర్మించారు. వర్షాకాలంలో భారీ వర్షాలు కురిసినప్పుడు బ్రిడ్జిపై నుంచి నీరు ప్రవహించడంతో మండల కేంద్రంతో పాటు కేశవపట్నం గ్రామ పంచాయతీకి రాకపోకలు నిలిచిపోతాయి. అంతేకాక గ్రామపంచాయతీకి రెండు కిలో మీటర్ల దూరంలో ఉన్న పాపయ్యపల్లెకు సరైన రోడ్డు లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. పాపయ్యపల్లె గ్రామానికి బ్రిడ్జితో పాటు బీటీ రోడ్డు వేసి సమస్యలు తీర్చాలని గ్రామస్థులు కోరుతున్నారు.

వరండాలోనే చదువులు.. పట్టించుకోని అధికారులు..

వీర్నపల్లి, జూలై 1 (ఆంధ్రజ్యోతి) : వీర్నపల్లి మండలం బావ్‌సింగ్ నాయక్ తండా ప్రాథమిక పాఠశాలలో 1వ తరగతి నుంచి 5వ తరగతి వరకు 27మంది విద్యార్థులు చదువుతున్నారు. పాఠశాలలో బోధించేందుకు ఒకే ఒక్క టీచర్ ఉండటంతో పాఠశాల గదిలో రెండు తరగతులు, గది బయట వరండాలో మూడు తరగతులకు ఒకే చోట బోధిస్తున్నారు. వరండాలో కూర్చొని చదువుతుండటంతో ముసురు వానకు విద్యార్థులు వణుకుతున్నారు. కనీసం కూర్చునేందుకు బెంచీలు కూడా కరువయ్యాయి. 11 మంది కంటే ఎక్కువ విద్యార్థులు పాఠశాలలో చదివితే ఇద్దరు ఉపాధ్యాయులు అవసరం ఉంటుంది. గతంలో విద్యార్థులకు సరిపడా టీచర్‌ను డిప్యూటేషన్‌పై కేటాయించడంతో ఇద్దరు ఉపాధ్యాయులు విద్యార్థులకు బోధించారు. ఈ సంవత్సరం డిప్యూటేషన్ రద్దవడంతో ఖాళీ ఏర్పడింది. ఒకే టీచర్ విద్యనందించడంతో కొంత మంది విద్యార్థుల తల్లిదండ్రులు ప్రైవేటు పాఠశాలలకు పిల్లలను పంపిస్తున్నారు. ఉన్నతాధికారులు ప్రభుత్వ పాఠశాలల్లో సరిపడా ఉపాధ్యాయులను కేటాయించి కనీస సదుపాయాలు కల్పించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.



వరండాలో నేలపై కూర్చున్న విద్యార్థులు

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

జగిత్యాల రూరల్, జూలై1(ఆంధ్రజ్యోతి): పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని జగిత్యాల జిల్లా ఉప వైద్యాధికారి డాక్టర్. శ్రీనివాస్ అన్నారు. జగిత్యాల రూరల్ మండలం లోని పొరండ్ల గ్రామంలో మంగళవారం ఉచిత ఈరోగ్య శిబిరం నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ప్రజలకు సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. కార్య క్రమంలో వైద్యఆరోగ్యశాఖ, సిబ్బంది రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

పాఠ్య పుస్తకాలు అందజేత

రాయికల్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): రాయికల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సముదాయం ప్రధానోపాధ్యాయుడు కాపు శ్రీనివాస్ ఆధ్వర్యంలో విద్యార్థులకు మంగళవారం పాఠ్య పుస్తకాలు, నోట్ బుక్‌లు, యూనిఫాంలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు జె.రాజేశం, చెరుకు మహేశ్వర శర్మ, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్‌కు సన్మానం

రాయికల్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇటిక్యాల గ్రామ విశ్వ బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో మంగళ వారం తహసీల్దార్ శ్రీరాముల నాగా ర్జునను సన్మానించారు. కార్యక్ర మంలో విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు చందనగిరి రమేష్, ప్రధాన కార్యదర్శి కనపర్తి శ్రీనివాస్, కోశాధికారి ఎదురుగట్ల రవీందర్, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

భీమారం, జూలై 1 (ఆంధ్రజ్యోతి): భీమారం మండల కేంద్రానికి చెందిన నేముల రాజు రోడ్డు ప్రమాదంలో గాయ పడగా గల్ఫ్ అడ్వైజర్ మెంబర్, భీమారం మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సింగిరెడ్డి నరేష్‌రెడ్డి మంగళవారం పరామర్శించారు. కార్యక్రమంలో నాయకులు బక్కూరి నరేష్, పెద్దిరెడ్డి స్వామి రెడ్డి, చెక్కపెల్లి సంజీవ్, ముంజ కిషన్, చెక్కపెల్లి శంకర్ తదితరులు పాల్గొన్నారు.

నిధులు మంజూరు

కథలాపూర్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సిరికొండ రేణుకా ఎల్లమ్మ ఆలయానికి రూ.50 లక్షలు, శ్రీరాజ రాజేశ్వరస్వామి ఆలయాలకు రూ.50 లక్షల చొప్పున ప్రభుత్వం నిధులు మంజూరు చేసినట్టు వేములవాడ ఎమ్మెల్యే, విప్ ఆది శ్రీనివాస్ తెలిపారు. కామన్ గుడ్ ఫండ్ దేవాదాయ శాఖ నుంచి నిధులు మంజూరు చేసినట్టు పేర్కొన్నారు. కాగా నిధులు మంజూరు చేయించిన విప్‌నకు మండల అధ్యక్షుడు కాయితి నాగరాజు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అజీం కృతజ్ఞతలు తెలిపారు.

●కథలాపూర్: మండలంలోని తక్కళ్ళపల్లిలో శ్మశానవాటిక వద్ద బోరు, మోటర్ ఏర్పాటు కోసం రు. 1.80 లక్షలు మంజూరైనట్టు ఆ గ్రామ మాజీ సర్పంచ్ అల్లకొండ లింగంగౌడ్, ఏఎంసీ డైరెక్టర్ విజయ్ తెలిపారు. విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్‌కు శ్మశానవాటిక వద్ద ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులు వివరించగా జిల్లా కలెక్టర్‌తో మాట్లాడి నిధులు మంజూరు చేయించారని చెప్పారు.

ఘనంగా జాతీయ వైద్యుల దినోత్సవం



జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్‌ను సన్మానిస్తున్న వైద్యులు, సిబ్బంది



కోరుట్లలో కేక్ కట్ చేస్తున్న వైద్యులు

జగిత్యాల అర్బన్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): జాతీయ వైద్యుల దినోత్సవాన్ని పురస్కరించుకొని మాతా శిశు కేంద్రంలో మంగళవారం వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా ప్రధానాసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సుమన్ మాట్లాడుతూ ప్రతి వైద్యుడు రోగిని రక్షించడానికే కృషి చేస్తాడన్నారు. అనంతరం వైద్యులు ఆయనను సన్మానించారు.

●జిల్లా సీనియర్ సిటిజన్స్ ఆధ్వర్యంలో వైద్యులకు సన్మానం చేశారు. సీనియర్ సిటీజన్స్ అధ్యక్షులు హరి అశోక్ కుమార్, ఆర్ఎంపి, పిఎంపి అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు రాజా గోపాల్‌చారిలు జిల్లా ప్రధానాసుపత్రి సూపరింటెండెంట్ సుమన్‌తో పాటు, ఐఎంఏ అధ్యక్షులు గూరూరి హేమంత్, వైద్య కళాశాల ప్రిన్సిపాల్ సయ్యద్ ఖాద్రీ, ఆర్ఎంవోలు డాక్టర్ గీతిక, డాక్టర్ శ్రీపతి, విజయారెడ్డి, నరేష్, డాక్టర్ సునీల్, ఐఎంఏ కార్యదర్శి ఆకుతోట శ్రీనివాస్ రెడ్డి, సంతోష్ రెడ్డి, డాక్టర్ కోటగిరి సుధీర్‌లను సన్మానించారు.

●జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్‌ను జగిత్యాల పట్టణంలోని నాయకులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ గోలి శ్రీనివాస్, నాయకులు అడువాల లక్ష్మణ్, పంబాల రాము, బద్దం జగన్, చెటిపెల్లి సుధాకర్, కూసరి అనిల్, పిట్ట ధర్మరాజు, వెంకటేశ్వర్‌రావు పాల్గొన్నారు.

●**కోరుట్ల:** పట్టణంలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో వైద్యుల దినోత్సవం, పోస్టల్ వర్కర్స్, చార్టెర్డ్ అకౌంటెంట్స్ డే నిర్వహించారు. పట్టణంలోని మనోహరి ఆసుపత్రిలో వైద్యులను సన్మానించారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సభ్యులు కోమ్ముల జీవన్ రెడ్డి, ఎలేటి లక్ష్మారెడ్డి, నల్ల గంగాధర్, గుంటుక సురేష్, గంద్ర ఆజయేందర్ రావు, అడెపు మధు, అల్లాడి ప్రవీణ్ కుమార్, ప్రవీణ్, వైద్యులు అనూప్‌రావు, రేగొండ రాజేష్, అన్వేష్, ముక్కనీల్ పాల్గొన్నారు.

●**కోరుట్ల రూరల్:** మండలంలోని అయిలాపూర్ గ్రామ లయన్స్ క్లబ్ సభ్యులు మంగళవారం డాక్టర్స్ డే, తపాల సిబ్బంది దినోత్సవం నిర్వహించారు. గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక ఆసుపత్రిలో వైద్యులను, తపాల కార్యాలయంలో సిబ్బందిని సన్మానించారు.

●**మెట్‌పల్లిటౌన్:** పట్టణంలో ఆర్ఎంపీ, పీఎంపీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఐఎంఏ జాతీయ వైద్య విధాన రాజ్యాంగ సవరణ కమిటీ మెంబర్ ఐఎంఏ మెట్‌పల్లి అధ్యక్షులు డాక్టర్ గంగసాగర్‌ను, డాక్టర్ రవి, డాక్టర్ నిర్మల్‌రెడ్డి, డాక్టర్ వెంకట్‌రెడ్డి, మహిళ వైద్యులు భారత రాణి, త్రివేణిలను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎంపీలు గాజంగి రాజమల్లయ్య, బండి శంకర్, జోగా నరసయ్య, సంగీత, అర్చన, గోరుమంతుల సురేందర్, దేవయ్య పాల్గొన్నారు.

●**ధర్మపురి:** ధర్మపురి పట్టణంలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో డాక్టర్స్‌డే, పోస్టల్ వర్కర్స్ డే నిర్వహించారు. ప్రభుత్వ ఆసుపత్రిలో డాక్టర్లను, పోస్ట్ ఆఫీస్‌లో ధర్మపురి బ్రాంచ్ పోస్ట్ మాస్టర్‌ను సన్మానించారు. ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రవి మాట్లాడుతూ తమ సేవలను గుర్తించి నందుకు లయన్స్ క్లబ్ వారికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ పట్టణ అధ్యక్షులు రవీందర్, సెక్రెటరీ సర్జారావు పాల్గొన్నారు.

●ధర్మపురి పట్టణంలోని శ్రీ వాణి విద్యాలయంలో డాక్టర్స్ డే నిర్వహించారు. పట్టణానికి చెందిన వైద్యులు డాక్టర్ పెండ్యాల మనస్విని, డాక్టర్ ద్యావళ్ల ప్రణవ్‌లు వైద్య వృత్తిపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ గట్ల శ్రీనివాస్, ప్రిన్సిపాల్ సంతోషి పాల్గొన్నారు.

●**రాయికల్:** తల్లిదండ్రులు జన్మనిస్తే.. వైద్యులు పునర్జన్మనిస్తారని రాయికల్ మాజీ మున్సిపల్ చైర్మన్ మోర హన్మాండ్లు అన్నారు. జాతీయ వైద్యుల దినోత్సవాన్ని పురస్కరించుకుని పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రి వైద్యులను ఘనంగా సన్మానించారు. అనంతరం నూతన లయన్స్ క్లబ్ బాధ్యతల స్వీకరణ సందర్భంగా జెండా ఆవిష్కరించి సేవా కార్యక్రమాలు ప్రారంభించారు. నేషనల్ పోస్టల్ వర్కర్స్ డే, చార్టెడ్ అకౌంట్ డే సందర్భంగా రాయికల్ పోస్ట్ ఆఫీస్ ఉద్యోగస్థులను, చార్టెడ్ అకౌంటెంట్లను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో వైద్యులు శశికాంత్ రెడ్డి, సురేందర్, అనిల్, సృజన, ఉదయ్ కుమార్, బెక్కం తిరుపతి, ఆర్ఎంపీ మండలోజు శ్రీనివాస్, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు కొత్తపెల్లి రంజిత్ పాల్గొన్నారు.

●**కథలాపూర్:** మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిణిలు సింధూజ, రజితలను లయన్స్‌క్లబ్ సభ్యులు సన్మానించారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు గడ్డం శ్రీనివాస్‌రెడ్డి, ఎల్లాల ప్రతాప్‌రెడ్డి, పిడుగు ప్రసాద్ ఉన్నారు.

●**కొడిమ్యాల:** మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యులు కేక్ కట్ చేసి వేడుకలు నిర్వహించారు. వైద్యులు నరేష్, పరమేశ్వరీలకు సిబ్బంది సన్మానం చేశారు. కార్యక్రమంలో సీహెచ్‌వో రాజశేఖర్ పాల్గొన్నారు.

●**సారంగాపూర్:** కాంగ్రెస్ మండల అధ్యక్షులు కోండ్ర రాంచందర్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యురాలు రాధరెడ్డి, పశువైద్యాధికారి సునిల్‌లను సన్మానించారు. ఈ కార్యక్రమంలో నాయకులు కోండ్ర రాంచందర్‌రెడ్డి, కొక్కు గంగారాం, మండల ప్రధాన కార్యదర్శి చేకుట శేఖర్ పాల్గొన్నారు.

జూనియర్ కళాశాలలకు మహర్దశ

(3వ పేజీ తరువాయి)

అగ్నిమాపక వ్యవస్థను అమర్చారు. కళాశాలల్లో మౌలిక వసతుల కల్పనతో ప్రవేశాల సంఖ్య పెరిగే అవకాశం ఉందని అధ్యాపకులు అంటున్నారు.

● నిర్వహణ నిధుల కోసం ఎదురుచూపులు

ప్రభుత్వం జూనియర్ కళాశాలల మరమ్మతులకు నిధులిచ్చినా నిర్వహణ నిధులు మంజూరు చేయలేదు. చాక్‌పీస్‌లు, స్టేషనరీ, రిజిస్టర్లు, జెండా వేడుకలు, ఇతర సమావేశాల ఖర్చులు, పారిశుధ్య నిర్వహణ, హాల్‌టికెట్ల డౌన్ లోడ్ తదితర అవసరాలకు ఒక్కో కళాశాలకు రూ.20 వేల నుంచి రూ.50 వేల వరకు వ్యయం అవుతోంది. దీంతో నిర్వహణ నిధులు అందించాలని అధ్యాపకులు కోరుతున్నారు.

సమస్యలు తీరుతాయి..

-బొప్పరాతి నారాయణ, జిల్లా ఇంటర్ విద్యాధికారి



ప్రభుత్వ కళాశాలల్లో అన్ని వసతులతో నాణ్యమైన విద్యను అందించేందుకు దృష్టి సారించాం. చాలా సంవత్సరాల తర్వాత జూనియర్ కళాశాలలకు నిధులు మంజూరు కావడం ఆనందంగా ఉంది. విద్యార్థులకు అవసరమైన మౌలిక వసతులు కల్పించేందుకు అవకాశం లభించింది. ఆయా కళాశాలలు నిధులను సద్వినియోగం చేసుకోవాలి.

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

-డీఆర్డీవో పీడీ రఘువరన్

-'ఆంధ్రజ్యోతి' కథనానికి స్పందన

మెట్‌పల్లి రూరల్, జూలై 1 (ఆంధ్రజ్యోతి) : విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామని డీఆర్డీవో పీడీ రఘువరన్ అన్నారు. మహిళా సమాఖ్య ద్వారా అందించే వ్యవసాయ అద్దె యంత్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని డీఆర్డీవో పీడీ రఘువరన్ అన్నారు. మంగళవారం జగ్గసాగర్ గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులు, వన మహోత్స కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం 'ఆంధ్రజ్యోతి'లో సోమవారం 'వ్యవసాయ యాంత్రీకరణకు తుప్పు' అనే శీర్షికతో ప్రచురించిన కథనంపై వివరణ కోరగా ఆయన స్పందించారు. సంబంధిత నిర్వాహకులను వివరణ కోరినట్లు పీడీ తెలిపారు. వ్యవసాయ యంత్రాలను రైతులు సాగులో వినియోగించుకొని ఖర్చులను ఆదా చేసుకోవాలన్నారు. విధుల పట్ల నిర్లక్ష్యం చేస్తే శాఖపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు.

వెలమ సంఘ సభ్యుల సంక్షేమానికి కృషి



బాధిత కుటుంబానికి చెక్కును అందిస్తున్న సంఘం అధ్యక్షుడు సాగర్‌రావు

జగిత్యాల, జూలై 1 (ఆంధ్రజ్యోతి):వెలమ సంఘ సభ్యుల సంక్షేమానికి కృషి చేస్తున్నట్లు జగిత్యాల వెలమ సంక్షేమ మండలి అధ్యక్షుడు అయిల్నేని సాగర్ రావు, ప్రధాన కార్యదర్శి దన్నపునేని వేణు గోపాల్ రావు అన్నారు. మంగళవారం పట్టణంలోని వెలమ సంక్షేమ సంఘ భవనంలో పలువురు బాధిత కుటుంబ సభ్యులకు ప్రమాద బీమా చెక్కులు, ఆర్థిక సహాయాన్ని అందించారు. గత యేడాది ప్రమాదవశాత్తు మృతి చెందిన గంద్ర సుమంత్ రావు కుటుంబ సభ్యులకు రూ. ఒక లక్ష ప్రమాద బీమా చెక్కును, అనారోగ్యంతో మృతి చెందిన సంఘ సభ్యుడు వంశీధర్ రావు కుటుంబ సభ్యులకు రూ. 72,820 ఆర్థిక సహాయాన్ని అందించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడారు. అన్ని వర్గాల సహకారాలతో గతంలో ఎన్నడూ లేని విదంగా పలు సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను చేపడుతున్నామన్నారు. ఈకార్యక్రమంలో జగిత్యాల వెలమ సంక్షేమ మండలి నాయకులు బండారి దివాకర్, వెన్నమనేని కృష్ణ, అయిల్నేని రవీందర్, మేన్నేని సురేందర్, యామనేని అజయ్, ప్రవీణ్, రాంప్రసాద్, బలమూరి సరళ, అయిల్నేని శ్రీలత, నేషనల్ ఇన్సూరెన్స్ డెవలప్‌మెంట్ అధికారి రామేశ్వర్, సలహా మండలి సభ్యులు పురుషోత్తం, రామచందర్ తదితరులు పాల్గొన్నారు.

నవోదయ పాఠశాలలో వసతులు కల్పించాలి



భవన సముదాయాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ సత్యప్రసాద్

కోరుట్ల, జూలై 1 (ఆంధ్రజ్యోతి) : కోరుట్ల పట్టణంలో కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న నవోదయ విశ్వ విద్యాలయం భవన సముదాయంలో అన్ని వసతులను వేగవంతంగా పూర్తి చేయాలని కలెక్టర్ సత్యప్రసాద్ అధికారులకు సూచించారు. మంగళవారం పట్టణంలోని అల్లమయ్య గుట్ట ప్రాంతంలో ఏర్పాటు చేస్తున్న తాత్కాలిక భవన సముదాయంను కలెక్టర్ సత్యప్రసాద్ అధికారులతో కలిసి పరిశీలించారు. భవనంలో ఏర్పాటు చేస్తున్న పనులను పరిశీలించి చేయవలసిన పనుల వివరాలను స్థానిక అధికారులకు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో కోరుట్ల ఆర్‌డీఓ జీవకర్‌రెడ్డి, తహసీల్దార్ కృష్ణ చైతన్య పాల్గొన్నారు.

'సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి'

కోరుట్ల, జూలై 1 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ ప్రవేశ పెడుతున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు జువ్వాడి కృష్ణారావు అన్నారు. మంగళవారం పట్టణంలోని పలు వార్డులలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను స్థానిక నాయకులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కృష్ణారావు మాట్లాడారు. నిరుపేదలకు రాష్ట్ర ప్రభుత్వం ఇండ్ల నిర్మాణంకు నిధులకు కేటాయించి దఫలవారిగా అందిస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు నహీం, రిజ్వాన్, తిరుమల గంగాధర్ గౌడ్, కొంతం రాజం, ఎంబేరి సత్యనారాయణలతో పాటు పలువురు పాల్గొన్నారు.

పుస్తకాలు పంపిణీ

గొల్లపల్లి, జూలై 1 (ఆంధ్రజ్యోతి): గొల్లపెల్లి మండలం మల్లన్నపేట గ్రామానికి చెందిన యువ నాయకుడు అవారి చందు తన పుట్టినరోజు సందర్భంగా మల్లన్నపేట ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు ఉపయోగపడే పుస్తకాలు, డిక్షనరీలు, వాటర్ బాటిళ్ళు పంపిణీ చేశారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు బీమా సత్యం, బండి విజయ్, నస్పూరి రాజన్న, గర్వందా వెంకన్న, బండారి శ్రీనివాస్, గాదం చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు నాటిన బీజేపీ నాయకులు

మల్యాల, జూలై 1(ఆంధ్రజ్యోతి): కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం 11 ఏళ్ల పాలనను పురస్కరించుకొని ముత్యంపేటలో కిసాన్‌మోర్చా ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో నాయకులు సామ మహిపాల్‌రెడ్డి, పొనగంటి రమేశ్, గౌతం, పన్నాటి మల్లేశం, గుర్రం శ్రీధర్‌గౌడ్, కట్కం లత, చంద్రశేఖర్, వేముల మణికంఠ, పొనగంటి సృజన్ పాల్గొన్నారు.

జిల్లాలో మోస్తరు వర్షం

-లోతట్టు ప్రాంతాల్లో ఇళ్లలోకి వరద నీరు



నాగునూర్ గ్రామంలో ఇంట్లోకి చేరిన వర్షపు నీరు

జగిత్యాల అర్బన్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో మంగళవారం ఓ మోస్తరు వర్షం కురిసింది. జగిత్యాల పట్టణంలో చిన్న పాటి వర్షానికే రోడ్లన్నీ బురదమయం అయ్యాయి. సోమవారం రాత్రి, మంగళవారం పడిన వర్షాలకు పట్టణంలోని పార్క్ పక్క సందులో రోడ్డు బురద మయం కాగా రోడ్డుపై అర అడుగు మేర నీరు నిలిచి ఉండడంతో జనం రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. పట్టణంలోని అనేక ప్రాంతాలలో సోమవారం, మంగళవారం కురిసిన వర్షానికి ఇళ్ళలోకి నీరు రావడంతో పాటు రోడ్లు బురదతో నిండిపోవడం, మురికి కాలువలు నిండి ప్రవహించడం మూలంగా అంటు వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని, అందువల్ల అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

●సారంగాపూర్: మండలంలో మంగళవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. దీంతో నాగునూర్ గ్రామంలో వరద నీరు ఓ ఇంట్లోకి చేరింది. దీంతో వరద నీటిని బయటకు పంపేందుకు ఇంటి వారు ఇబ్బందులు పడ్డారు. వర్షం కురిస్తే వరద నీరు ఇళ్ళలోకి వచ్చి చేరుతుందని కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వెంటనే సంబంధిత అధికారులు నాగునూర్ గ్రామంలో వరద నీరు ఇళ్ళలోకి రాకుండా సమస్యలను పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని కాలనీ వాసులు అధికారులను వేడుకుంటున్నారు.

పూడూర్-వేములవాడ బస్సు పునఃప్రారంభం

కొడిమ్యాల, జూలై 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని పూడూర్ నుంచి రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడకు మంగళవారం ఆర్టీసీ బస్సును పునఃప్రారంభించారు. దీంతో పూడూర్‌లో చొప్పదండి ఎమ్మెల్యే డాక్టర్ మేడిపల్లి సత్యం చిత్ర పటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో మల్యాల వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ జీవన్‌రెడ్డి, టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి కడారి మల్లేశం, పూడూర్ సింగిల్ విండో చైర్మన్ బండ రవీందర్‌రెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నారాయణగౌడ్, మాజీ ప్రజాప్రతినిధులు రామస్వామి, రాంరెడ్డి, నాయకుల అజయ్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, అయిలయ్య, చంద్రమోహన్‌రెడ్డి, మహేష్, తిరుపతి, సంతోష్, మల్లేశం పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ విస్తృత స్థాయి సమావేశంలో పాల్గొన్న 'జువ్వాడి'

మెట్‌పల్లిటౌన్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): నిజామాబాద్‌లో జరిగిన కాంగ్రెస్ పార్టీ పార్లమెంటు విస్తృతస్థాయి కార్యకర్తల సమావేశంలో కోరుట్ల నియోజకవర్గ ఇంచార్జి జువ్వాడి నర్సింగరావు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర మంత్రి సీతక్క, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్, ప్రభుత్వ సలహాదారు మాజీమంత్రి షబ్బీర్ అలీ, ఎమ్మెల్యేలు బొజ్జ, మదన్మోహన్ రావులు పాల్గొనగా జువ్వాడి నర్సింగరావు సన్మానించారు. ఈసందర్భంగా జువ్వాడి నర్సింగరావు మాట్లాడుతూ ఈనెల 4న హైదరాబాద్‌లో నిర్వహించే కాంగ్రెస్ పార్టీ సమావేశానికి కోరుట్ల నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ పార్టీ శ్రేణులు అధిక సంఖ్యలో తరలి వచ్చి విజయవంతం చేయాలని కోరారు.

విద్యుదాఘాతంతో గేదె మృతి

కోరుట్ల రూరల్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మోహన్‌రావుపేట గ్రామంలో మంగళవారం విద్యుదాఘాతంతో గేదె మృతి చెందినట్లు గ్రామస్థులు తెలిపారు. గ్రామానికి చెందిన చీప్పరి లక్ష్మీనారాయణకు చెందిన గేదె వ్యవసాయ క్షేత్రంలో గడ్డి మేస్తుండగా పక్కనే ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌కు తగిలి మృతి చెందింది. రూ.30 వేల నష్టం వాటిల్లినట్లు బాధితుడు లక్ష్మీనారాయణ తెలిపారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించాలి

-మండల వైద్యాధికారి అంజిత్‌రెడ్డి

మెట్‌పల్లి రూరల్, జూలై 1 (ఆంధ్రజ్యోతి) : ప్రస్తుత వర్షాకాలంలో వ్యాపించే సీజనల్ వ్యాధులపై ప్రజల్లో అవగాహన కల్పించాలని మండల వైద్యాధికారి, డాక్టర్ అంజిత్‌రెడ్డి ఆశా వర్కర్లకు ఆదేశించారు. మంగళవారం మండలంలోని జగ్గసాగర్ గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాల్లోని ఇంటింటికి వెళ్లి వర్షాకాలంలో నీటి నిల్వ వల్ల కలిగే అనర్థాలను ప్రజలకు అవగాహన కల్పించి, ప్రతీ శుక్రవారం డ్రైడేగా పాటించాలని, నీటి నిల్వలు లేకుండా, వ్యాధులు సోకకుండా జాగ్రత్తలు పాటించే విధంగా ప్రజలలు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించాలన్నారు. గ్రామాల్లోని గర్భిణుల పేర్లు రికార్డుల్లో నమోదు చేయాలని, వారు ప్రతి నేల చెకప్ చేయించుకునేలా, ప్రభుత్వ ఆసుపత్రుల్లో కాన్పులు చేయించుకోనే అవగాహన కల్పించాలన్నారు. విధులను నిర్లక్ష్యం చేస్తే శాఖపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు, ఆరోగ్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల భవనం కూల్చివేత పనుల పరిశీలన

మెట్‌పల్లి టౌన్, జూలై1 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల శిథిలావస్థలో ఉన్నందున భవన కూల్చివేత పనులను కలెక్టర్ సత్యప్రసాద్ మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాల చదువుతున్న విద్యార్థులకు తాత్కాలికంగా ప్రభుత్వ జూనియర్ కాలేజీలో అకామిడేషన్ ఏర్పాట్లను చేశామని జిల్లా కలెక్టర్ తెలిపారు. విద్యార్థులకు 15 రోజులలో గాను తాత్కాలికంగా భవన పనులు ఏర్పాట్లు చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. ఆయన వెంట ఆర్డీవో శ్రీనివాస్, మున్సిపల్ కమిషనర్ మోహన్, ఎమ్మార్వో శ్రీనివాస్, మండల విద్యాధికారి చంద్రశేఖర్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

వన మహోత్సవంలో అందరినీ భాగస్వాములను చేయాలి



మొక్క నాటుతున్న డీఆర్డీవో పీడీ రఘువరన్

మెట్‌పల్లి రూరల్, జూలై 1 (ఆంధ్రజ్యోతి) : వన మహోత్సవ కార్యక్రమంలో ప్రజలను భాగస్వాములు చేస్తూ విజయవంతం చేయాలని డీఆర్డీవో, పీడీ రఘువరన్ అన్నారు. వనమహోత్సవ కార్యక్రమంలో భాగంగా మంగళవారం మండలంలోని జగ్గసాగర్ గ్రామంలో ఎంపీడీవో మహేశ్వర్‌రెడ్డితో కలిసి మొక్కను నాటి నీరు పోసి ప్రారంభించారు. అనంతరం గ్రామంలోని సంపద వనం, ప్లాంటేషన్ సైట్‌లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వన మహోత్సవంలో భాగంగా ఇంటింటికి మొక్కలను అందించాలన్నారు. వనం పరిశీలించి పంచాయతీ కార్యదర్శి ప్రశాంత్‌ను అభినందించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ కిసాన్ సెల్ మండలాధ్యక్షుడు పిడుగు తిరుపతిరెడ్డి, పంచాయతీ ఈసీ లక్ష్మయ్య, పంచాయతీ కార్యదర్శి ప్రశాంత్, టెక్నికల్ అసిస్టెంట్స్ మల్లయ్య, సుమాన్, వినోద్ పాల్గొన్నారు.

●మెట్‌పల్లిటౌన్: ప్రతి ఒక్కరు మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని మున్సిపల్ కమిషనర్ టి.మోహన్ అన్నారు. మంగళవారం పట్టణంలోని 15వ వార్డ్‌లో,చెన్నకేశవ ఆలయ సమీపంలో వందరోజుల ప్రణాళికల భాగంగా ఉమెన్ ఫర్ ట్రీ ఉద్దేశ్యంతో పూల మొక్కలు, వివిధ రకాల మొక్కలను మహిళలతో కలిసి నాటారు. కార్యక్రమంలో మేనేజర్ వెంకటలక్ష్మి, ఏఇలు తిరుపతి, దీపక్, ఆర్‌ఐ అక్షయ్, శానిటరీ ఇన్స్పెక్టర్ రత్నాకర్, శివ, ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీర్ విష్ణు, ఆర్పీలు,మహిళలు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

●జగిత్యాలరూరల్: ప్రతి ఒక్కరు మొక్కలు నాటి సంరక్షించాలని జగిత్యాల ఎంపీడీఓ విజయలక్ష్మీ, తహసీల్దార్ రాంమోహన్ అన్నారు. మంగళవారం జగిత్యాల మండలం మోతె గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల ఆవరణలో తహసీల్దార్, ఎంపీడీఓ మొక్కలను నాటారు. కార్యక్రమంలో ఎంపీఓ వాసవి, పంచాయితీ కార్యదర్శి కృష్ణచైతన్య పాల్గొన్నారు.

●పెగడపల్లి: వన మహోత్సవంలో ప్రతి ఒక్కరు భాగస్వాములవ్వాలని పెగడపల్లి ఎంపీడీవో ఎ.శ్రీనివాస్ ంరెడ్డి పేర్కొన్నారు. పెగడపల్లి మండల కేంద్రం నుండి మల్యాల వెల్లే డబుల్ రోడ్డుకు ఇరువైపులా పెగడపల్లి శివారులో మొక్కలు నాటే కార్యక్రమాన్ని మంగళవారం ఎంపీడీవో శ్రీనివాస్‌రెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీవో మహేందర్, కార్యదర్శి ప్రవీణ్ కుమార్, ఉపాదిహామీ టెక్నికల్ అసిస్టెంట్ రాజేశం పాల్గొన్నారు.

●సారంగాపూర్: ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో మంగళవారం హరితహారం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చైర్మన్ ఎలేటి నర్సింహరెడ్డి, సీఈవో శివ, డైరెక్టర్‌లు రాంచందర్‌రెడ్డి, శేఖర్ రెడ్డి, ఇబ్రాహీం, రాజయ్య, శాంతమ్మ, సిబ్బంది పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో నిబంధనలు పాటించాలి



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ బీఎస్ లత

ధర్మపురి, జూలై 1 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో నిబంధనలు పాటించాలని అదనపు కలెక్టర్ బీఎస్ లత అన్నారు. లబ్ధిదారులు ఇళ్లు త్వరితగతిన నిర్మించుకోవాలని ఆమె సూచించారు. ధర్మ పురి మండలంలోని దమ్మన్నపేట, రాజారం గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులతో మంగళవారం ఆమె సమావేశం నిర్వహిం చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని ప్రతిష్ఠాత్మకంగా చేపట్టినట్లు తెలిపారు. లబ్ధిదారులు వెంటనే ఇళ్ల నిర్మాణ పనులు ప్రారంభించాలని ఆమె తెలిపారు.

ప్రభుత్వ నియమ నిబంధనల మేరకు నిర్ణయించిన కొలతల ప్రకారమే ఇళ్లు నిర్మించుకోవాలని ఆమె అన్నారు.. ఇందు కోసం ప్రభుత్వం అన్ని విధాల సహకారం అందిస్తుందని ఆమె పేర్కొన్నారు. లబ్ధిదారులు ఇళ్లు నిర్మించుకునే సమయంలో సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుక రావాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో ధర్మపురి ఎంపీడీవో రవీందర్, మండల ఇంచార్జ్ తహసీల్దార్ సుమన్, హౌసింగ్ ఏఈఈ భవాని పాల్గొన్నారు.

వేతనాలు చెల్లించాలని ఆందోళన

జగిత్యాల అర్బన్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): ఎనిమిది నెలలుగా జీతాలు చెల్లించకపోవడంతో తెలంగాణ డయాగ్నోస్టిక్ హబ్ వాహన డ్రైవర్లు మంగళవారం ఆందోళన చేపట్టారు. వేతనాల విషయమై అధికారులకు పలు మార్లు వినతిపత్రాలు అందించినప్పటికీ స్పందన లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తాము విధులు నిర్వహించబోమని వాహనాలను నిలిపి వేశారు. దీంతో జిల్లా వైద్యాధికారి ప్రమోద్, ప్రోగ్రాం అధికారులు త్వరలో తమ సమస్య పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో డ్రైవర్లు విధులకు హాజరయ్యారు.

వన మహోత్సవానికి ఏర్పాట్లు

కథలాపూర్, జూలై 1 (ఆంధ్రజ్యోతి) : వనమహోత్సవంలో భాగంగా మండలంలో 1.13 లక్షల మొక్కలు నాటేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్టు ఎంపీడీవో శంకర్ నాయక్ తెలిపారు. ఇప్పటికే 38 వేల గుంతలు కూలీలతో తవ్వించామని చెప్పారు. నర్సరీలను ఎప్పటికప్పుడు పంచాయతీ కార్యదర్శులతో పర్యవేక్షణ చేయిస్తున్నామని చెప్పారు.

మొక్కలు నాటిన ఆలయ అధికారులు

ధర్మపురి, జూలై 1 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి పట్టణంలోని పాత టీటీడీ ధర్మశాల ఆవరణలో లక్ష్మీ నరసింహ స్వామి దేవాలయం పక్షాన ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ జక్కు రవీందర్, ధర్మకర్తలు, సిబ్బంది కలిసి మంగళవారం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆలయ ఈవో, చైర్మన్ మాట్లాడుతూ నాటిన ప్రతి మొక్కకు నీరు పోసి సంరక్షిం చాలని అన్నారు. కార్యక్రమంలో ఆలయ సూపరింటెండెంట్ ద్యావళ్ల కిరణ్, ధర్మకర్తల మండలి సభ్యులు పాల్గొన్నారు.

పుస్తకాలు పంపిణీ

మెట్‌పల్లిటౌన్, జూలై1 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఇంద్ర ప్రియదర్శిని కాలనీ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు మంగళ వారం ఫ్రెండ్స్ వెల్ఫేర్ చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు పుస్తకాలను పంపిణీ చేశారు. 25 మంది పేద విద్యార్థులకు రాత పుస్తకాలను, ఇతర సామాగ్రిని అంద జేశారు. కార్యక్రమంలో ట్రస్ట్ అధ్యక్షులు సుర్గి శ్రీనివాస్ గౌడ్, రాంప్రసాద్, చింటూ పాల్గొన్నారు.